
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 7 ఫిబ్రవరి 2024



సిటీలో మెట్రో సర్వీసులు ఇక ఉండవ్

వాటి స్థానంలో ఆర్డినరీ బస్సులను నడపాలని పీటీడీ నిర్ణయం

- లిమిటెడ్ స్టాపులు ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయంటున్న అధికారులు
- అన్ని స్టాపుల్లో ఆగేలా మార్చి ఒకటో తేదీ నుంచి కొత్త సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు వెల్లడి

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 6:
నగర పరిధిలో ఇకపై మెట్రో సర్వీసులు ఉండవు. ఇప్పటి వరకూ సిటీలో సత్వర రవాణా సేవలందిస్తున్న మెట్రో సర్వీసులన్నింటినీ రద్దు చేసి వాటి స్థానంలో ఆర్డినరీ బస్సులను నడపాలని ప్రజా రవాణా శాఖ (పీటీడీ)/ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. మార్చి ఒకటో తేదీ నుంచి ఈ విధానం అమలు కానున్నది.

నగరానికి నలువైపులా మధురవాడ, కొత్తవలస, సబ్బవరం, అగనంపూడి హద్దులుగా గుర్తించిన అధికారులు ఆయా ప్రాంతాలకు ఆర్డినరీ సర్వీసులు నడపనున్నట్టు వెల్లడించారు. సిటీలో తిరుగుతున్న మెట్రో సర్వీసులకు లిమిటెడ్ స్టాపులు ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు తమకు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వాటి స్థానంలో ఆర్డినరీ బస్సులు ప్రవేశపెట్టి అన్ని స్టాపుల్లోను ఆపేలా చూడాలని అందిన సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఆర్ఎం తెలిపారు.

విశాఖపట్నం రీజియన్‌లోని మధురవాడ, వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, గాజువాక, స్టీల్ సిటీ, సింహాచలం డిపో పరిధిలో మొత్తం 804 బస్సులు ఉన్నాయి. ఇందులో 54 స్పేర్ సర్వీసులు పోను 750 బస్సులు రోజువారీ ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. వీటిలో 541 సర్వీసులు సిటీలో తిరుగుతున్నాయి. సిటీ సర్వీసుల్లో 124 మెట్రోలు, 417 ఆర్డినరీ సర్వీసులు ఉండేవి. అయితే ఇప్పటికే 70 మెట్రో సర్వీసులను ఆర్డినరీ సర్వీసులుగా మార్చారు. మరో 30 మెట్రోలను అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు, పాయకరావుపేట, విజయనగరం రూట్లకు మార్చి, ఆ మార్గాల్లో తిరుగుతున్న ఆర్డినరీ సర్వీసులను సిటీకి బదలాయించారు. ప్రస్తుతం 24 మెట్రోలు మాత్రమే సిటీ పరిధిలో తిరుగుతున్నాయి. ఈ నెలాఖరులోగా కొత్తగా 30 ఆర్డినరీ సర్వీసులు విశాఖకు రానున్నాయని, అందులో 24 సర్వీసులు ప్రస్తుతం ఉన్న మెట్రోల స్థానే ప్రవేశపెట్టి, మెట్రోలను దూర ప్రాంతాలకు ... మిగతా 6వ పేజీలో

లక్ష్యం గొప్పగా ఉండాలి


ప్రసంగిస్తున్న నిక్ వుజిసిక్

"కల ఎప్పుడూ గొప్పగా ఉండాలి. ఆ కలను సాకారం చేసుకునేందుకు నిరంతరం పరితపించాలి. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలవాలి. అప్పుడే విజయం దక్కుతుంది. జీవితంలో ఎత్తుపల్లాలు సహజం. గెలుపు, ఓటమిని రెండింటినీ ఒకేలా తీసుకోవాలి."

- ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

- వార్త I పేజీలో

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు - వివరాలు I పేజీలో

అక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి సురక్షితమేనా!?

కెరటాలు బలంగా తీరాన్ని తాకే ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై అభ్యంతరాలు

- గతంలో ఆ ప్రాంతంలో కోతకు గురైన తీరం
- తొలుత తెన్నేటి పార్కు వద్ద ఏర్పాటుకు సన్నాహాలు.. అనుమతులు తీసుకోవాలన్న అటవీ శాఖ
- అక్కడి నుంచి ఆగమేఘాలపై ఆర్కే బీచ్ వద్దకు షిఫ్ట్
- వీఎంఆర్‌డీఏ అధికారుల ఇష్టారాజ్యం
- కలెక్టర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్నంత మాత్రాన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సమంజసమేనా??

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అధికారులు కొన్ని విషయాల్లో నిబంధనలు పాటించడం లేదు. చట్టాలను గౌరవించడం లేదు. జిల్లా కలెక్టర్ ఆ సంస్థకు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉండడంతో ఏమి చేసినా ఎవరూ ప్రశ్నించరనే ధీమాతో ముందుకు వెళుతున్నారు.


కురుసుర వద్ద బీచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి

చాలాకాలంగా ఇదే జరుగుతోంది.

తాజాగా పర్యాటకులను ఆకర్షించడానికి కేరళలో మాదిరిగా 'ఫ్లోటింగ్ బ్రిడ్జి' ఒకటి కురుసుర సబ్‌మెరైన్ సమీపాన ఆర్కే బీచ్‌లో ఏర్పాటుచేస్తున్నారు. దీనిని మొదట తెన్నేటి పార్కు సమీపాన బంగ్లాదేశ్ నౌక వద్ద ఏర్పాటు చేయాలని పనులు ప్రారంభించారు. బీచ్‌లు, నదులు, జలపాతాల వద్ద ఎటువంటి పర్యాటక ప్రాజెక్టులు చేపట్టినా పర్యాటక శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీచేసింది. అదేవిధంగా బీచ్‌లో ఏమి చేసినా కోస్తా నియంత్రణ మండలి నిబంధనలు పాటించాలి. ఇదే సమయంలో ప్రాజెక్టు ఏర్పాటుచేసే భూమి ఎవరిదైతే వారి నుంచి కూడా అనుమతి తీసుకోవాలి. కానీ కలెక్టర్ నేతృత్వంలో నడుస్తున్న సంస్థ కావడంతో ఎవరి అనుమతులు లేకుండా తెన్నేటి పార్కు వద్ద పనులు ప్రారంభించారు. అది అటవీ శాఖ భూమి కావడంతో ఆ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పారు. అనుమతి తీసుకోవాలని సూచించారు. ఆ అనుమతి వచ్చేంత వరకూ ఓపిక పట్టలేక.. వెంటనే ఆ ప్రాజెక్టును ఆగమేఘాలపై కురుసుర సబ్‌మెరైన్ వద్దకు మార్చేశారు. ఆ ప్రాంతం అంతా వీఎంఆర్‌డీఏ ఆధీనంలో ఉందనుకొని పనులు చేపట్టేశారు. అయితే ఆ ఏరియా అంతా జీవీఎంసీ పరిధిలో ఉంది. వారి అనుమతి అవసరం. కమిషనర్, కలెక్టర్ ఇద్దరూ అవగాహనతో ఉండడం వల్ల వారు అభ్యంతరం చెప్పలేదు. అయితే దీనికి పర్యాటక శాఖ నుంచి ఎటువంటి అనుమతి లేదు. వారూ అభ్యంతర పెట్టలేదు.

అది సరైన వేదిక కాదు

ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుచేసిన ప్రాంతం సరైనది కాదు. అలలు సాఫీగా ఉండే చోట అటువంటి ... మిగతా 6వ పేజీలో

విమానాశ్రయం కళకళ

రోజుకు 60 విమాన సర్వీసులు రాకపోకలు


విమానాశ్రయంలో ప్రయాణికులు

- 2022తో పోల్చితే 2023లో 23 శాతం మేర పెరిగిన ప్రయాణికులు
- కరోనా ముందు స్థాయికి చేరిక
- ఏప్రిల్ నుంచి ప్రతిరోజూ అంతర్జాతీయ విమానం
- త్వరలో డిజి యాత్ర... త్వరగా ఎంట్రీ క్లియరెన్స్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయానికి మళ్లీ పూర్వపు కళ వచ్చింది. కరోనాకు ముందు 2019లో నెలకు రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. కరోనా వల్ల విమానాలు తగ్గిపోవడంతో ప్రయాణికుల సంఖ్య పడిపోయింది. అంతర్జాతీయ సర్వీసులు పూర్తిగా రద్దయిపోయాయి. ఆ తరువాత పరిస్థితులు సర్దుకున్నా..పూర్వపు స్థాయికి చేరడానికి రెండేళ్లు పట్టింది. 2022లో రోజుకు సగటున 50 సర్వీసులు చొప్పున ఏడాదిలో 19,766 విమానాలు తిరిగాయి. వాటిలో 22,28,663 మంది ప్రయాణించారు. అదే 2023వ సంవత్సరానికి వచ్చేసరికి సగటున రోజుకు ఎగిరే విమానాల సంఖ్య 60కి పెరిగింది. ఆ ఏడాదిలో ప్రయాణించిన వారి సంఖ్య 28,97,631కి చేరింది. అంటే నెలకు 2.4 లక్షల మంది..రోజుకు ఎనిమిది వేల మంది

విమాన సర్వీసులు పెరిగిన తీరు

- 2022లో విశాఖ నుంచి 19,766 విమానాలు ఎగరగా 2023లో వాటి సంఖ్య 21,073కి పెరిగింది. అంటే 1,307 విమానాలు పెరిగాయి. 6.20 శాతం వృద్ధి రేటు నమోదైంది.
- 2022లో ప్రయాణికుల సంఖ్య 22,28,663 కాగా 2023లో అది 28,97,631కి చేరింది. అంతకు ముందు ఏడాది కంటే 23.09 శాతం వృద్ధి సాధించి 6,68,968 ప్రయాణికులు పెరిగారు.

ప్రయాణించారు. ఈ మార్కు కూడా దాటి రోజుకు పది వేల మంది ప్రయాణించేలా విమానాశ్రయం అధికారులు ఏర్పాట్లు చేశారు. అందుకు తగిన వసతులు సమకూర్చారు. ప్రస్తుతం ప్రయాణికుల చెకింగ్ కౌంటర్లు 21 ఉండగా అదనంగా మరో 10 పెట్టారు. మొత్తం 31 అందుబాటులో ఉన్నాయి. మౌలిక వసతులు, లాంజ్, బ్యాగేజ్ ఏర్పాట్లు విస్తరించారు. మొదటి అంతస్థులో వీఐపీ లాంజ్ కూడా ఏర్పాటుచేశారు.

విదేశీ సర్వీసులు...రోజూ ఒకటి

కరోనాకు ముందు దుబాయ్, సింగపూర్, మలేషియా, శ్రీలంకలకు అంతర్జాతీయ ... మిగతా 6వ పేజీలో

దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా...

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి


నిరంజన్ (ఫైల్ ఫొటో)


మణికంఠరెడ్డి (ఫైల్ ఫొటో)

కొమ్మాది, ఫిబ్రవరి 6: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృత్యువు పాలయ్యారు. నగర శివారు కొమ్మాది సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోతినమల్లయ్యపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు నీలాపువారి వీధికి చెందిన పి.నిరంజన్ (20), కె.మణికంఠరెడ్డి (21) స్నేహితులు. వీరు...మరో ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనాలపై మంగళవారం విజయనగరం పైడితల్లమ్మ దర్శనానికి వెళ్లారు. నిరంజన్, మణికంఠరెడ్డి ఒక బైక్‌పై ఉన్నారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా బోరవానిపాలెం వద్ద రహదారిపై గేదె అడ్డొచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఉండగా వెనుక నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో నిరంజన్, మణికంఠరెడ్డి లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో నిరంజన్ నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మణికంఠరెడ్డి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరి తల్లితండ్రులు రోజువారీ కూలీలు. చదువుకుని ప్రయోజకులవుతారనుకుంటే ఇలా అర్థంతరంగా తమను వదిలి కడుపుకోత మిగిల్చారంటూ ఇరువురి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించారు. సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఆస్తి పన్ను పేరు మార్చడానికి రూ.7 వేలు లంచం డిమాండ్

- వార్త I పేజీలో

హెచ్‌ఎంలపై పాఠశాలల నిర్వహణ భారం

గత ఏడాది నుంచి గ్రాంటు ఇవ్వని ప్రభుత్వం



- స్టేషనరీ కోసం ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు
- అవి చాలవన్నట్టు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించాలని ఒత్తిళ్లు
- ఉన్నత పాఠశాలలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ బిల్లు
- నాడు-నేడు నిధులు వాడకూడదని ఆంక్షలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):
ప్రైవేటు విద్యా సంస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఇబ్బందులను మాత్రం పట్టించుకోవడం లేదు. సుమారు ఏడాది నుంచి పాఠశాలల నిర్వహణకు గ్రాంటు విడుదల చేయని పాలకులు...చివరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుపైనా దోబూచులాడుతున్నారు. మరోవైపు విద్యుత్ బిల్లులు చెల్లించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఈపీడీసీఎల్ అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గతంతో పోల్చితే విద్యుత్ వాడకం పెరిగింది. ప్రతి గదిలో నాలుగు ఫ్యాన్లు, ట్యూబు లైట్లు, మంచినీటి సరఫరాకు ఆర్వో ప్లాంట్, మధ్యాహ్న భోజనం తయారీ, మరుగుదొడ్ల నిర్వహణకు మోటార్లు...ఇలా పలు రకాల అవసరాలకు విద్యుత్ తప్పనిసరైంది. దీంతో ఉన్నత పాఠశాలలకు సగటున నెలకు రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకూ బిల్లు వస్తోంది. ఈ విషయాన్ని ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల ద్వారా విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన పాఠశాలలు విద్యుత్ బిల్లులు చెల్లించనక్కర్లేదని చెప్పారు తప్ప...అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వలేదు. మంత్రి హామీతో గడచిన ఆరేడు నెలల నుంచి పాఠశాలలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. అయినా ప్రతినెలా బిల్లు మాత్రం పాఠశాలలకు ఈపీడీసీఎల్ అధికారులు పంపుతున్నారు. కొన్నిచోట్ల మండల స్థాయి విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఇదిలావుండగా రెండేళ్ల కిందటి కంటే పాఠ శాలల్లో విద్యుత్ వినియోగం బాగా పెరగడాన్ని ఈపీడీసీఎల్ అధికారులు గుర్తించారు. ఏడాది సగటుతో పోల్చితే అదనంగా వినియోగించే విద్యుత్‌ను ప్రత్యేక డిమాండ్‌గా పరిగణిస్తారు. ఆ మేరకు అన్ని పాఠశాలలకు ఈపీడీసీఎల్ అధికారులు తాజాగా నోటీసులు జారీచేశారు. ఒక్కొక్క పాఠశాలకు రూ.15 వేల నుంచి రూ. 30 వేల వరకు అదనంగా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆరేడు నెలల నుంచి బకాయిలతో పాటు అదనపు డిమాండ్‌కు సంబంధించి బిల్లులు చెల్లించాలని చెప్పడంతో హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులకు సంబంధించి హెచ్‌ఎంలపై ఒత్తిడి చేయొద్దని ఈపీడీసీఎల్‌ను ప్రభుత్వం ఆదేశించాలని, ఆ మేరకు ఒక కాపీని డీఈవోలకు పంపితే ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

సుద్దముక్కలకు బడ్జెట్ లేదు

విశాఖ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 584 ఉన్నాయి. పాఠశాల నిర్వహణ అంటే సుద్దముక్కల నుంచి తెల్ల కాగితాలు, జిరాక్స్, విద్యుత్ బిల్లులు, మరమ్మతులు వంటి ఖర్చులు ఉంటాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఇంత వరకూ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం గ్రాంటు ఇవ్వలేదు. గత విద్యా సంవత్సరం ... మిగతా 6వ పేజీలో

మోసగాడు

- తహసీల్దార్ హత్య కేసులో నిందితుడైన మురహరి సుబ్రహ్మణ్యం గంగారావుపై పలు ప్రాంతాల్లో చీటింగ్ కేసులు
- కాంట్రాక్టులు ఇప్పిస్తానని హైదరాబాద్‌లో రూ.1.5 కోట్లు టోకరా
- వాటర్‌ప్లాంట్ పేరుతో విజయవాడలో రూ.40 లక్షలు మోసం


నిందితుడు మురహరి సుబ్రహ్మణ్యం గంగారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):
తహసీల్దార్ సనపల రమణయ్యను హత్య చేసిన మురహరి సుబ్రహ్మణ్యం గంగారావు నమ్మించి మోసం చేయడంలో సిద్ధహస్తుడని పోలీసుల విచారణలో తేలింది. తానో పెద్ద వ్యాపారవేత్తనని, ఆర్థికంగా స్థితిమంతుడినని నమ్మించేలా దర్పం ప్రదర్శించి ఎదుటి వారిని ఆకట్టుకుంటాడని పోలీసులు చెబుతున్నారు. ఈ విధంగా మూడేళ్ల కిందట హైదరాబాద్‌లో రోడ్డు కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించి పత్తిపాటి రవి అనే అతని వద్ద పలుదఫాలుగా రూ.1.5 కోట్లు వరకూ తీసుకుని మోసం చేసినట్టు తెలిసింది. దీనిపై రవి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదుచేశారు. ఆ తర్వాత గంగారావు విజయవాడకు మకాం మార్చాడు. అక్కడ భవానీపురానికి చెందిన విరూపాక్ష అనే వ్యక్తికి వాటర్ ప్లాంట్ వ్యాపారం పేరుతో రూ.40 లక్షలు టోకరా వేశాడు. బాధితుడు దీనిపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. గంగారావు మోసాలు, అప్పుల వారి నుంచి వేధింపులతో విసిగిపోయిన అతని భార్య...విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం గంగారావు పెదరుషికొండలోని జువెల్ అపార్టుమెంట్‌లో ఒంటరిగా ఉంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు.



పట్టు వదలని తిప్పల నాగిరెడ్డి

- టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు
- కార్పొరేటర్లు, అనుచర వర్గంతో అమరావతికి...
- ఒకవేళ తనకు ఇవ్వకుంటే తాను సూచించిన వ్యక్తికి ఇవ్వాలని డిమాండ్

- 6వ పేజీలో

జిల్లా గ్రంథాలయ సంస్థ అంచనా బడ్జెట్‌కు ఆమోదం

సీతమ్మధార, ఫిబ్రవరి 6: జిల్లా గ్రంథాలయ సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరాల సవరణబడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు సభ్యుల ఆమోదం లభించింది. రామాటాకీస్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం లో మంగళవారం సర్వ సభ్య సమావేశం చైర్మన్ కొండా రాజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లోని మౌలిక వసతులు, అభివృద్ధికి రూపొందించిన బడ్జెట్ అంచనాలు తదితర అంశాలపై చర్చించారు. సవరణ బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు సంబంధించిన పద్దులపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ జి.లక్ష్మణ రావు, డీపీవో కార్యాలయ ఏవో బీవీకే సత్యనారాయణ, వయోజన విద్యాశాఖ ఏడీడి.చిన్నికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సి హెచ్ వెంకటరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 6: అయిస్టా ఆధ్వర్యంలో సీఎంఆర్ అండర్-12, 14 బాలుర, బాలికల టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రా యూనివర్సిటీ టెన్నిస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈ టోర్నీని ఏపీ మాజీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వైస్ చైర్మన్ వైవీ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా క్రమం తప్పకుండా ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీతోపాటు వర్ధమాన ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్న అయిస్టా ప్రతినిధులు అభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అయిస్టా ప్రతినిధులు ప్రేమ్‌చంద్, డీఎస్ఎన్ రాజు, టోర్నీ నిర్వాహక కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు, రామారావు, డాక్టర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ
ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధిగా 'సుందరపు'



నియామకపు పత్రమిస్తున్న పవన్ కల్యాణ్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 6: జనసేన పార్టీ ఉత్తరాంధ్ర పార్టీ ముఖ్య ప్రతినిధిగా సుందరపు సతీష్‌కుమార్‌ను ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ నియమించారు.ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉత్తరాంధ్రప్రాంతంలో పార్టీ అభివృద్ధికి పాడాలని పవన్ కల్యాణ్ సూచించారు.

నేడు బాబా ఆలయ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 6 : స్థానిక ఎనభై అడుగుల రోడ్డు రామచంద్రనగర్‌లోని శివసాయి ఆలయం 25వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్టు శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు శరగడం అప్పారావు తెలిపారు. ఉదయం 5 గంటల సాయిబాబాకు మేలుకొలుపు పాటలు, కాకడ హారతితో ప్రారంభమవుతుందన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



నిర్వాహకుడు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న గంటా

మర్రిపాలెం, ఫిబ్రవరి 6: మర్రిపాలెంలో టీడీపీనాయకుడు పొలమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు ట్రస్ట్ సహకారంతో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరానికి విచ్చేసిన ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు శ్రీభరత్..శ్రీనివాసరావును అభినందించారు. ఈ శిబిరంలో సుమారు 92 యూనిట్ల రక్తం ఎన్‌టీఆర్ ట్రస్ట్ వైద్య సిబ్బంది సేకరించారు. ఈసందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని తలపెట్టాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి, విశాఖ పార్లమెంట్ నాయకుడు సనపల వరప్రసాద్, 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్ కుట్టా, వార్డు అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు కంచరాపు శ్రీని వాసరావు, డీవీ శ్రీనివాసరావు, రాపేట్ అశోక్, హరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లీ కరుణించమ్మా...!

▸ ఫిషింగ్ హార్బర్‌లో సముద్రానికి హారతి

మహారాణిపేట, ఫిబ్రవరి 6: ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మతల్లికి హారతి పూజలు, అభిషేకాలను మంగళవారం ఘనంగా నిర్వ హించారు. హార్బర్‌లో గత నవంబరులో అగ్ని ప్రమాదం సంభవించినచోటకు ఏపీ మెకా నైజ్‌డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్సు అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంనుంచి పెద్దఎత్తున మహిళలు కలశాలతో ఊరే గింపుగా వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా జానకీరామ్ మాట్లాడుతూ నవంబర్‌లో హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తర్వాత చేపలవేట తగ్గుముఖం పట్టిందన్నారు. ఈనేపథ్యంలో గంగమ్మతల్లి ఆశీస్సులతో భవిష్యత్తులో ఏ ప్రమాదాలు జరగకుండా, విశాఖ నగరాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల 4 వ తేదీ నుంచి యజ్ఞం, శాం తి హోమం, తదితర పూజలు మూడురోజులుగా నిర్వహించినట్టు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయంనుంచి ఊరేగింపుగా వెళ్లి హార్బర్‌లో గంగమ్మతల్లికి, మత్స్య నారాయణునికి పూజలు చేశామన్నారు.మహిళలు అమ్మవారికి కలశాభిషేకం చేశారన్నారు. వ్యాపారకలాపాలు యథావిధిగా సాగాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీ బొత్స ఝాన్సీ, అక్కరమాని విజయనిర్మల, మత్స్య కార సంఘాల నేతలు పాల్గొన్నారు.



కలశాలతో వెళ్తున్న మహిళలు



హారతి సమర్పిస్తున్న మత్స్యకారులు

భూ హక్కు యాజమాన్య చట్టం రద్దుపై మొండి వైఖరి తగదు

▸ రహదారిని దిగ్బంధించి న్యాయవాదుల నిరసన

▸ సీఎం జగన్, మంత్రి ధర్మాన దిష్టిబొమ్మల దహనం

మహారాణిపేట, ఫిబ్రవరి 6: ప్రజా వ్యతిరేక భూ హక్కుల యాజమాన్య చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. భూహక్కుల యా జమాన్య చట్టం రద్దు కోరుతూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 50 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం స్పందించకపోవటంతో న్యాయవాదులు రహదారిపైకి వచ్చిన రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన, ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రహదారి దిగ్బంధంతో జగదాంబ, అటు జైలు రోడ్డు వరకు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి.



జిల్లా కోర్టు ఎదుట రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులు

అనంతరం న్యాయవాది పలకా శ్రీరా మూర్తి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తం గా అన్ని రాష్ట్రాలు ఈ చట్టాన్ని వ్యతిరేకించినా, కేవలం ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. ప్రజల వ్యక్తిగత ఆస్తులకు రక్షణ లేని ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

▸ ఏడీసీ విశ్వనాథన్



41వవార్డులో పర్యటిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 6: గ్రేటర్ 41వ వార్డు పరిధిలోని సెబాస్టియన్ కాలనీ, జేఎస్ఎన్ఎంఆర్‌యూ కాలనీల్లో మంగళవారం జీవీఎంసీ అద నపు కమిషనర్‌విశ్వనాథన్ పర్యటించారు. కాలనీల్లో రోడ్లు, పారిశుధ్య పనులను పరిశీలించారు.స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 24 గంటల నీటిసరఫరాల కోసం తవ్విన గోతులను పూడ్చాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలని కోరారు. పారిశుధ్య పనుల్లోఅలసత్వం వహించ్దొని అధికారులను ఆదేశించారు. ఆయన వెంటజడ్సీ ఆర్.జి.వి. కృష్ణ, సహాయ వైద్యాధికారి సునీల్ కుమార్, ఈఈ మత్సరాజు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయ ఆవరణలో గండి బాబ్జీ

జ్ఞానాపురం, ఫిబ్రవరి 6: అల్లిపురం చెరువుగట్టు సమీపంలోని శ్రీఅరుణ లింగేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనం గా నిర్వహించారు. టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దాసన సత్యనారాయణ, ఈగలపాటి అప్పారావు, ఆలయ ధర్మకర్త వి.వెంకటేశ్వరరావు, రమేష్, నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

16న రవాణా రంగం బంద్



మాట్లాడుతున్న సీఐటీయూనేత కుమార్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 6: రవాణా రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16 తేదీన క్యాబ్ యూనియన్ తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేసీ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సిటు కార్యాలయంలో క్యాబ్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో రవాణా రంగాన్ని నమ్ముకొని 6 కోట్ల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రంగంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. సిటు నాయకులు బి.జగన్, క్యాబ్ యూనియన్ నాయకులు సిహెచ్ శ్రీనివాస్, పోలినాయుడు,మోటారు యూనియన్ ప్రధానకార్యదర్శి జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమా ఉత్సవాలు ప్రారంభం



చిత్ర దర్శకులు హెచ్ఎం రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 6: తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 92 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆచార్య ఎన్‌వీఎస్ దుర్గాప్రసాద్‌రావు ఈ ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ముందుగా భక్త ప్రహ్లాద చిత్ర దర్శకులు హెచ్ఎం రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆచార్య దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ మానవతా విలువలను పెంపొందించే సినిమాలు ప్రజలకు చేరువ కావడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈ ఉత్సవం సినిమా పరిశ్రమ జరుపుకోవాల్సి ఉందన్నారు. 1955లో విడుదలైన బంగారు పాప చిత్రాన్ని ప్రదర్శించారు. సమావేశంలో చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, ఉషారాణి, అర్చన, కష్టారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

పట్టు వదలని తిప్పల నాగిరెడ్డి

టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు

గాజువాక, ఫిబ్రవరి 6: గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం ఉరుకూటి రామచంద్రరావును నియమించినప్పటికీ టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. గాజువాక అభ్యర్థి రామచంద్రరావేనని గత వారం ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి బహిరంగంగా ప్రకటించారు. ఆ మరుసటిరోజే నాగిరెడ్డి తన అనుచరులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినంత మాత్రాన.. అతనే అభ్యర్థి అవుతాడన్నది ఎక్కడా లేదని, గతంలో బీఫామ్ ఇచ్చిన తరువాత కూడా క్యాండెట్లను మార్చిన సందర్భాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. తాజాగా ముఖ్య నేతలను కలిసేందుకు తన ఇద్దరు కుమారులతో పాటు అనుచర వర్గాన్ని తీసుకుని అమరావతి తీసుకువెళ్లారు. మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజనిలను కలిసి టికెట్ తనకే కేటాయించాలని కోరారు. ఒకవేళ తమకు ఇవ్వని పక్షంలో తాము సూచించిన వ్యక్తికి ఇవ్వాలని పట్టుబట్టారు. ప్రధానంగా విశాఖ ఎంపీ టికెట్ బొత్స ఝాన్సీకి కేటాయించే అవకాశం ఉండడంతో తిప్పల అనుచర వర్గం మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి నాగిరెడ్డికి టికెట్ కేటాయిస్తే విజయం తథ్యమని తెలిపారు. ఇందుకు బొత్స స్పందిస్తూ జగన్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

జగన్ అపాయిట్‌మెంట్ కోసం యత్నం

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసేందుకు ఎమ్మెల్యే నాగిరెడ్డి యత్నిస్తున్నారు. ఒకవేళ అపాయిట్‌మెంట్ లభిస్తే తన అనుచరవర్గంలోని కార్పొరేటర్‌లు, ముఖ్యమైన నేతలతో వెళ్లి టికెట్ అడగాలని భావిస్తున్నారు. నాగిరెడ్డికి మద్దతుగా అమరావతి వెళ్లిన వారిలో కార్పొరేటర్‌లు భూపతిరాజు సుజాత, బొడ్డు నరసింహమూర్తి, ఇమ్రాన్, రాజాన రామారావు, తిప్పల వంశీరెడ్డి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, పార్టీ వార్డు అధ్యక్షులు ఉన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

మర్రిపాలెం, ఫిబ్రవరి 6: మర్రిపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 8 ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు అర్బన్ సీడీపీఓ రమణకుమారి తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా నేరుగా గాని పో స్టుద్వారాగాని మర్రిపాలెం ఆర్‌అండ్‌బీ జంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు విశాఖపట్నం కార్యాలయానికి చేరాలన్నారు.

అక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి సురక్షితమేనా!?

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారు. కానీ కురుసుర వద్ద అలలు ఒక్కోసారి బలంగా తీరాన్ని తాకుతాయి. అంతేకాదు. ఆ ప్రాంతంతో తీరం తరచూ కోతకు గురవుతుంటుంది. కురుసుర మ్యూజియం ప్రహరీ కూడా అలల ధాటికి కూలిపోయిన సందర్భాలు ఉన్నాయి. జీవీఎంసీ అధికారులే తీరాన్ని పటిష్ఠం చేసే పనులు చేపట్టారు. అలాగే ఆ ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు 'ఇచ్చట ఈతకు సముద్రంలో దిగరాదు..ప్రమాదకరం' అనే హెచ్చరిక బోర్డులు కూడా ఉన్నాయి. ఇంకా...ఇప్పుడు ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుచేసిన స్థలం పక్కన మురుగు కాలువ ఉంది. ప్రస్తుతం అది ఎండిపోయినట్టుగా ఉన్నా...వర్షం పడితే నగరంలో మురుగునీరంతా అక్కడే సముద్రంలో కలుస్తుంది. అయితే అనుమతులు గట్రా అంటే...మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుందని అధికార పార్టీకి క్రెడిట్ దక్కదని అధికారులు ఆలోచిస్తున్నారు తప్ప...కాసింత ఆలస్యమైనా సురక్షితమైన ప్రాంతంలో పెట్టాలనే ప్రయత్నం చేయడం లేదు.

గతంలోను అంతే!!

ఆరు నెలల క్రితం తెన్నేటి పార్కు ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో అధికార పార్టీ నేతలు చెప్పిన వారికి దుకాణాల కేటాయింపునకు ఏకంగా కైలాసగిరినే తవ్వేశారు. దీనిపై పలువురు హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చారు. అది అమలులో ఉండగానే రాత్రికి రాత్రి పనులు పూర్తిచేసేశారు. చెట్లు కొట్టడానికి, కొండను తవ్వడానికి కూడా ఏ శాఖ అనుమతి తీసుకోలేదు.

సిటీలో మెట్రో సర్వీసులు ఇక ఉండవ్

... 5వ పేజీ తరువాయి

వినియోగించేందుకు అధికారులు నిర్ణయించారు.

జోన్ పరిధిలోని ప్రాంతాలకు

విశాఖ రీజియన్ నుంచి విజయనగరం జోన్ పరిధిలోని దూర ప్రాంతాలకు మెట్రో సర్వీసులు ఎక్కువగా నడపాలని అధికారులు భావిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకు, విజయనగరం జిల్లాలోని విజయనగరం, సాలూరు, బొబ్బిలి, శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, రాజాం, పలాస, టెక్కలి, సోంపేట వంటి ప్రాంతాలకు మెట్రో సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక తయారుచేశారు. ఈ మేరకు షెడ్యూల్స్ కూడా ఖరారు చేశారు. ఈ ప్రాంతాలకు ప్రస్తుతం డీలక్స్, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ, సర్వీసులతో పాటు మెట్రోలు కూడా నడుస్తున్నాయి. ఈ రూట్లలో మరిన్ని మెట్రో సర్వీసులు నడిపేందుకు అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

అన్ని స్టాపుల్లో అన్ని బస్సులు ఆగుతాయి

అంధవరపు అప్పలరాజు, రీజనల్ మేనేజర్, విశాఖ రీజియన్

సిటీ పరిధిలోని ప్రయాణికులకు పూర్తిస్థాయిలో రవాణా సేవలందించాలనే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. పాస్ హోల్డర్సుకు, రాయితీ పాస్‌హోల్డర్లకు, ఉచిత బస్‌పాస్‌లు కలిగిన వారికి ఆర్డినరీ బస్సు ఎక్కేందుకే అవకాశం ఉంది. ఇవి అన్ని స్టాపుల్లోను, రిక్వెస్టు స్టాపులోను ఆగుతాయి. కనుక ఎటువంటి ఇబ్బంది ఉండదు.

విమానాశ్రయం కళకళ

... 5వ పేజీ తరువాయి

విమాన సర్వీసుల ఉండేవి. ఆ తరువాత ఒక్క సింగపూర్ విమాన సర్వీసు మాత్రమే పునరుద్ధరించారు. ఇది వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. తాజాగా ఎయిర్ ఏసియా ముందుకు రావడంతో కొత్తగా బ్యాంకాక్‌కు ఓ సర్వీసు వచ్చింది. ఇది ఏప్రిల్ నుంచి నడుస్తుంది. అలాగే మలేషియాకు కూడా మరో సర్వీసు ప్రకటించింది. ఇవి కూడా వారానికి మూడు రోజులు నడుస్తాయి. అంటే ఏప్రిల్ నుంచి ప్రతి రోజూ విశాఖ నుంచి విదేశీ విమానం ఎగురుతుంది. త్వరలో శ్రీలంక, తదితర దేశాలకు సర్వీసులు వస్తాయని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం చెబుతోంది.

అందుబాటులోకి డిజి యాత్ర యాప్

విమాన ప్రయాణికులకు చెకింగ్ సమయం తగ్గించేందుకు డిజి ఫౌండేషన్ 'డిజి యాత్ర' పేరుతో యాప్‌ను రూపొందించింది. ఇది ఏప్రిల్ నుంచి విశాఖపట్నంలో అందుబాటులోకి వస్తుంది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే విమాన ప్రయాణం చేసేటపుడు ఆధార్ వివరాల ఆధారంగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా సెక్యూరిటీ చెక్ నుంచి తక్కువ సమయంలో విమానాశ్రయం లోపలకు వెళ్లొచ్చు. బోర్డింగ్ పాస్‌పై బార్ కోడ్‌ని స్కాన్ చేయగానే ప్రయాణికుడి వివరాలన్నీ లగేజ్ చెకింగ్ కౌంటర్‌లో డిస్‌ప్లే అవుతాయి. అక్కడ కూడా అతి తక్కువ సమయంలో చెకింగ్ పూర్తయిపోతుంది. లోపల సెక్యూరిటీ చెక్‌కు ముందే జరిగే ప్రాసెస్ అంతా చాలా తక్కువ సమయంలో ఏ పత్రాలు చూపించకుండానే ముగుస్తుంది. ఇది పెద్ద విమానాశ్రయాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఏప్రిల్ నుంచి విశాఖపట్నంలో ప్రారంభిస్తామని విమానాశ్రయం ఇన్‌చార్జి డైరక్టర్ తెలిపారు.

జూలై నుంచి దుబాయ్ సర్వీసు

- ఓ.నరేశ్‌కుమార్, ఏపీ విమాన ప్రయాణికుల సంఘం

విశాఖపట్నం నుంచి మొదట దుబాయ్‌కే విమాన సర్వీసు మొదలైంది. ఆ తరువాతే సింగపూర్, మలేషియా, శ్రీలంక సర్వీసులు వచ్చాయి. ఇప్పుడు దుబాయ్ సర్వీసు అందుబాటులో లేదు. దీనిని జూలై నుంచి పునరుద్ధంచే ప్రయత్నాలు సఫలమయ్యాయి. కొత్త షెడ్యూల్‌లో దీనిని ప్రకటిస్తారు.

హెచ్ఎంలపై పాఠశాలల నిర్వహణ భారం

... 5వ పేజీ తరువాయి

జిల్లాలో సగం పాఠశాలలకు గ్రాంటు ఇచ్చి... మిగిలిన పాఠశాలలకు ఇవ్వలేదు. నిర్వహణ గ్రాంటు లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడు తున్నారు. నాడు-నేడు కింద జిల్లాలోని పాఠశాలల్లో ప్రధానంగా ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మంచినీటి సరఫరా ట్యాప్‌లు, ఫ్లోరింగ్ మరమ్మతుల కోసం రూ.2.6 కోట్లు విడుదల చేశారు. అయితే ఈ నిధులు కేవలం మరమ్మతు లకు తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించ వద్దని ప్రభుత్వం తేల్చిచెప్పింది. దీంతో పాఠశాలల నిర్వహణ తలకు మించిన భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపో తున్నారు. నగరంలోని చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో రోజువారీ తరగతుల నిర్వహణకు సుద్దముక్కల ఖర్చు హెచ్ఎం భరించాల్సి వస్తోంది.

విద్యుత్ బకాయిలపై ఒత్తిడి లేకుండా ఆదేశాలివ్వాలి

- ఈ.పైడిరాజు, ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ విశాఖ జిల్లా శాఖ

ఉన్నత పాఠశాలలకు ప్రతి నెలా రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తోంది. దీనికితోడు అదనంగా వాడిన విద్యుత్‌కు తాజాగా బిల్లులు పంపుతున్నారు. దీంతో హెచ్ఎంలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యుత్ బిల్లుల చెల్లింపుల నుంచి పాఠశాలలకు మినహాయింపు ఇచ్చేలా ఉత్తర్వులు జారీచేయాలి. బకాయిలు చెల్లించలేదని విద్యుత్ నిలిపివేస్తే పరీక్షల వేళ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

విమ్స్‌లో వైద్యుల పోస్టుల భర్తీకి 9న ఇంటర్వ్యూ

ఆరిలోవ, ఫిబ్రవరి 6: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఉత్తీర్ణత శాతం, రూల్‌ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అనస్థీషియా ఐదు, న్యూరోసర్జరీ-1, న్యూరాలజీ-2, కార్డియాలజీ-1, సర్జికల్ ఆంకాలజీ-2, ఎమర్జెన్సీ మెడిసిన్-1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)-3, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-12, మెడికల్ ఆంకాలజీ-1, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండ్రోక్రైనాలజీ-1, పల్మనాలజీ-1 ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

రక్షణ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలి

నేవీ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాసన్

మురళీనగర్, ఫిబ్రవరి 6 ; భారత రక్షణ రంగంలో మరింతగా ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలని డైరెక్టర్ జనరల్ నేవీ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జి.శ్రీనివాసన్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ జంక్షన్ మారియట్ హోటల్ వేదికగా సీఐఐ సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం), డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్, డిఫెన్స్ మినిస్ట్రీలసౌజన్యంతో ఎంఎస్ఎంఇ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీనివాసన్ మాట్లాడారు. భారత నౌకాదళంలో అధిక శాతం ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం ఉన్నందున ఈ దిశగా స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం, ఆర్డినెన్స్ డెలివరీ, మెయింటెనెన్స్, జీవనోపాధి లక్ష్యాలను నెరవేర్చడంలో ఎంఎస్ఎంఇల పాత్రను వివరించారు. ఏపీ వాణిజ్య, పరిశ్రమల శాఖ సెక్రటరీ డాక్టర్ ఎన్.యువరాజ్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఇ పార్కు స్థాపనకు నామమాత్రపు ధరలకు భూమిని కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. టి డాక్ ఆఫీసర్ ఇన్‌చార్జి కమొడోర్ ఎస్.కె.సింగ్, ఈస్ట్రన్ నేవల్ కమాండ్ సీఎస్‌వో నెల్సన్ డిసోజా, ప్రీతమ్ లాల్, కె.టి. మిధున్, ఎస్‌బీసీ, హెచ్ఎస్ఎల్, బెల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీనివాసన్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి రెండు వారాలు రిమాండ్

కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడు మురహరి సుబ్రహ్మణ్యం గంగారావుకు కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించింది. విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పని చేసి విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ అయిన రమణయ్యను ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటల సమయంలో సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుప రాడ్‌తో కొట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన తర్వాత చెన్నై పారిపోయిన నిందితుడిని నగర పోలీసులు సోమవారం అక్కడ అరెస్టు చేసి ఇక్కడకు తీసుకొచ్చారు. సుమారు 20 గంటలపాటు గంగారావును విచా రించిన పోలీసులు...మంగళవారం కోర్టులో హాజరుపరిచగా రెండు వారాలు రిమాండ్ విధించింది.పెదరుషికొండ ప్రాంతంలో ఒక అపార్టుమెంట్ నిర్మించిన స్థలానికి సంబంధించి కన్వెయెన్స్ డీడ్‌ను రమణయ్య జారీ చేయలేదనే హత్యకు తెగబడినట్టు నిందితుడు పోలీసుల విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. తన పని చేయకుండా జాప్యం చేశారనే కోపంతో రాడ్‌తో కొట్టాలనుకున్నానని, ప్రాణాలు తీయాలని మాత్రం అనుకోలేదని నిందితుడు చెప్పినట్టు సమాచారం. తహసీల్దార్‌పై దాడి చేసిన తర్వాత ఆయన ప్రాణాలతో ఉన్నాడనే భావనతో తాను నేరుగా ఇంటికి వెళ్లిపోయానని పోలీసులకు వివరించినట్టు తెలిసిం ది.తహసీల్దార్ ప్రాణాలు కోల్పోయినట్టు తెలి యడంతో నగరంనుంచి పరారైనట్టు తెలి పాడు. కాగా ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లడానికి ఎవరు సహకరించారు?, కన్వెయన్స్ డీడ్ పని ఎవరు అప్పగించారు?, ఆర్థికపరమైనలావాదేవీల కు సంబంధించిన సమాచారాన్ని నిందితు డు రకరకాలుగా పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో ఈ కేసులో మరిన్ని వివరాలు రా బట్టాల్సి ఉన్నందున నిందితుడిని నాలుగు రోజులపాటు కస్టడీకి అప్పగించాలని పీఎం పా లెం పోలీసులు కోర్టులో పిటిషన్ వేసినట్టు తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రం పనులు పరిశీలన

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 6: గ్రేటర్ 46వ వార్డు సూరిబాబు నగర్‌లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఈ అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో దీన్ని పునర్నిర్మానానికి జీవీఎంసీ నిధులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా చెప్పారు. నాణ్యతతో నిర్మాణం పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జి.అప్పారావు, ఎస్.కృష్ణ, ఎస్.రామారావు, కె.లావణ్య, ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు ఉన్నారు.



ఉక్కు జీఎం చక్రవర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఇంటక్ నాయకులు

కార్మికులపై ఆంక్షలు విధించడం సరికాదు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 6: ఉక్కు కార్మాగార యాజమాన్యం కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలేసి కార్మికులపై ఆంక్షలు విధించడం సరికాదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్) చక్రవర్తిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ప్లాంట్‌లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, క్యాంటీన్ సౌకర్యాన్ని మెరుగుపరచాలని, కార్మికులకు అన్ని రకాల వసతులు కల్పించాకే బయోమెట్రిక్‌ను అమలు చేయాలని, అప్పటివరకు దానిని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఎస్‌పీ నాయుడు, జీ.ప్రభాకరరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఈడీ కార్యాలయం వద్ద ధర్నా

ఉక్కు కార్మికులను భయాందోళనకు గురిచేసేలా యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేశారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, కార్మికుల ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలే తప్ప వారికి ఇక్కట్లకు గురి చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్లాంట్ అధ్యక్షుడు వైటీ దాసు, నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, డీవీ రమణారెడ్డి, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

నియోజకవర్గ ఈఆర్‌వో పి.శేషశైలజ

పెందుర్తి, ఫిబ్రవరి 6: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సెక్టార్ అధికారులు, పోలీసులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల నిర్వహణపై ఈఆర్‌వో సమీక్ష చేశారు. నియోజవర్గంలో 282 పోలింగ్ బూత్‌లకు 27 సెక్టార్ల అధికారులకు 27 మంది పోలీసులు ఉన్నారని, వీరంతా సమన్వయంతో ఎన్నికల నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. సెక్టార్ పరిధిలో గల పోలింగ్ కేంద్రాన్ని స్వయంగా సందర్శించి వసతులు, ఓటర్లకు గల అనుకూలతలను పరిశీలించాలని సూచించారు. సమస్యాత్మక అంశాలను నమోదు చేసుకోవాలని, సోషల్ కమ్యూనిటీ, లా అండ్ ఆర్డర్, రాజకీయ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. సెక్టార్ అధికారుల నివేదికను ఆమె పరిశీలించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటరావు, ఎన్నికల డీటీ వి.అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్‌పై అవగాహన

గాజువాక, ఫిబ్రవరి 6: గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం గాజువాక జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు హౌసింగ్ స్థలాల పట్టా రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడా తప్పులు దొర్లకుండా చాలా జాగ్రత్తగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలకు మేలు జరిగే విధంగా, ఏ ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ కమిటీ సభ్యులతో 'పల్లా' సమావేశం

అగనంపూడి, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ 79వ వార్డు బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం టీడీపీ జిల్లా టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సభ్యులకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, బూత్ కమిటీ సభ్యులు సింగిడి సింహాచలం, జి.కనకభవాని, కె.జగదీశ్, నాగేశ్వరరావు వెంకటరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేను సందర్శించిన డిఫెన్స్ కళాశాల శిక్షణ సిబ్బంది

పెందుర్తి, ఫిబ్రవరి 6: న్యూఢిల్లీకి చెందిన నేషనల్ డిఫెన్స్ కళాశాల శిక్షణ సిబ్బంది 16 మంది మండల వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో మంగళవారం మండలంలోని పినగాడిలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆర్బీకే ద్వారా రైతులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర, ఎరువులు, విత్తనాల పంపిణీ తదితర అంశాలను వారికి ఆర్బీకే సిబ్బంది వివరించారు. ఎయిర్‌వేస్ మార్షల్ మనీశ్‌కుమార్ గుప్తా ప్రాతినిధ్యం వహించిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పూడికల తొలగింపు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 6: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీలోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ జామ్ కావడంతో మురుగు నీరు పొంగి వీధుల్లో రహదారిపై ప్రవహించింది. యూజీడీలో పాలిథిన్ కవర్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరంతా జామ్ అయి వీధుల్లో ప్రవహించడంతో అంతటా దుర్గంధం నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. దీంతో స్థానికులు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడుకు ఫిర్యాదు చేయడంతో ఆయన ప్రజారోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు యూజీడీలో పేరుకుపోయిన కవర్లు, చెత్తాచెదారాన్ని తొలగించారు.

హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

మల్కాపురం, ఫిబ్రవరి 6: హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురు టీడీపీ నాయకులతో కలిసి హెచ్‌పీసీఎల్ పీఆర్‌వో కాళీని సంస్థ గేటు వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసినా హెచ్‌పీసీఎల్ యజమాన్యం గానీ వైసీపీ నాయకులు, జిల్లా అధికారులు కాగా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు జరుగుతున్నందున ఇక్కడ అత్యాధునిక సౌకర్యాలతో బర్న్స్ వార్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. హెచ్‌పీసీఎల్ కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు పాండ్రంగి జయరాజు, దేవర అప్పలరాజు, సూర్యప్రకాశ్, వెంకటేశ్వరరావు, గోపి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 6: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి తొలిపూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరసలో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

శ్రీనగర్, ఫిబ్రవరి 6: విద్యార్థి స్థాయి నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఆసక్తి పెంచుకున్నట్లయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యాపిల్ ఐ స్కూల్, టీఎస్సార్ టీబీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. శ్రీనగర్‌లోని యాపిల్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఇటీవల జాతీయ స్థాయిలో బాక్సింగ్‌లో విజేతగా నిలిచిన విద్యార్థిని మానసకు రూ.ఐదే వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ప్రమీలా ముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లమ్మ సారె ఊరేగింపు

వేపగుంట, ఫిబ్రవరి 6: జీవీఎంసీ 95వ వార్డు పరిధి కృష్ణరాయపురం విద్యాగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక అనంత గండార పైడితల్లమ్మకు మంగళవారం సారె సమర్పించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు విద్యాగణపతి ఆలయంలో పూజలు చేశాక పసుపుకుంకుమలు, సారెను భక్తులతో కలిసి తలపై పెట్టుకుని అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని సమర్పించారు. వైసీపీ నాయకులు సూరిబాబు, ఉమామహేశ్, గోపి, చాణక్య, తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడ ఎస్సీ షాపింగ్ కాంప్లెక్సు ఆవరణలో నిరుపయోగంగా ఉన్న బోరింగ్



సీతానగరం ప్రధాన రహదారి పక్కన రెండేళ్లుగా మూలకు చేరిన హ్యాండ్ బోర్



ముసలినాయుడుపాలెంలో ఏడాదిన్నరగా పనిచేయని బోరింగ్

బోరుమంటున్నాయ్..

75వ వార్డులో మరమ్మతులతో మూలకు చేరిన హ్యాండ్ బోర్లు

వేసవి తీవ్రతకు ముందే అందుబాటులోకి తేవాలని వేడుకుంటున్న ప్రజలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 6: మహా విశాఖ నగరపాలక సంస్థ గాజువాక జోన్ 75వ వార్డు పరిధిలోని అనేక హ్యాండ్ బోర్లు పనిచేయక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడవి నిరుపయోగంగా మారాయి. వార్డు పరిధిలోని ప్రతి కాలనీలో ఒక హ్యాండ్ బోరు ఉంది. నీటిని ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని మూడేళ్ల క్రితం వీటిని జీవీఎంసీ అధికారులు దశలవారీగా వేయించారు. అయితే వీటికి చిన్నపాటి మరమ్మతు వచ్చినా దానిని సరిచేయకపోవడంతో వాటికి మరిన్ని సాంకేతిక లోపాలు తలెత్తాయి. మరమ్మతులకు గురైన బోరింగులను బాగుచేయాలని గ్రేటర్ అధికారులను కోరినా వారు స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. వార్డు పరిధిలోని అన్ని కాలనీలకు జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఒక్కోసారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాంటి సమయంలో అందరూ అందుబాటులో ఉన్న బోరింగ్ లను నీటి అవసరాల కోసం వినియోగించుకునేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. హ్యాండ్ బోర్లన్నీ దాదాపుగా మూలకు చేరడంతో ప్రత్యామ్నాయం లేక కొళాయిల నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. వార్డు పరిధిలోని పెదగంట్యాడ షాపింగ్‌కాంప్లెక్స్ ఆవరణ, సీతానగరం ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ ఆవరణల్లోని హ్యాండ్ బోర్లు గత ఆరు నెలలుగా పనిచేయడం లేదు. సీతానగరం కాలనీలోనిదైతే రెండేళ్లుగా మూలకు చేరినా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.

అలాగే ముసలినాయుడు పాలెంలోని బోరింగ్ ఏడాదిన్నరగా పనిచేయడం లేదు. వీటిని జీవీఎంసీ అధికారులు బాగు చేయిస్తే అత్యవసర సమయాల్లో వినియోగించు కోవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. వేసవి కాలంలో తలెత్తే నీటి ఇబ్బందులను అధికారులు దృష్టిలో పెట్టుకుని బోరింగ్‌లకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

సత్వరమే బాగు చేయాలి



జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో మరమ్మతులకు గురైన హ్యాండ్ బోర్లను అధికారులు గుర్తించి త్వరితగతిన మరమ్మతులు చేయించాలి. వీటికి మరమ్మతులు చేయడంలో జాప్యం చోటుచేసుకుంటే మరింతగా పాడయ్యే అవకాశం ఉంది. రానున్నది వేసవి కాలం కాబట్టి కొళాయిల నుంచి పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరగదు. అలాంటి సమయంలో బోరింగ్‌లు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్న విషయాన్ని అధికారులు గుర్తించి తక్షణమే వీటికి మరమ్మతులు చేయాలని వేడుకుంటున్నాం.

-పెద్దాడ సోమునాయుడు, సీతానగరం

ఆకర్షణీయంగా పార్కు

హెచ్‌పీసీఎల్ నిధులతో ఆధునీకరించిన జీవీఎంసీ అధికారులు

త్వరలో ఎంఐజీ కాలనీలో అందుబాటులోకి..

మల్కాపురం, ఫిబ్రవరి 6: జీవీఎంసీ 60వ వార్డు పరిధి ఎంఐజీకాలనీలో హెచ్‌పీసీఎల్ సౌజన్యంతో సుమారు రూ.50 లక్షలతో గ్రేటర్ పబ్లిక్ వర్క్స్ విభాగం అధికారులు ఆధునీకరించిన చిల్డ్రన్స్ పార్కు ప్రారంభానికి ముస్తాబవుతున్నది. ఒకప్పుడు అధ్వానంగా ఉండే ఇక్కడి పార్కును ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిచుకునేవారు. దీంతో కాలనీ కమిటీ ప్రతినిధులు దీనిని ఆధునీకరించాలని కోరుతూ జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఈ విషయం కాస్త హెచ్‌పీసీఎల్ అధికారుల దృష్టికి వెళ్లడంతో సంస్థ యాజమాన్యం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సుమారు రూ.50 లక్షల నిధులు విడుదల చేయడంతో ఎంతో సుందరమయంగా పార్కును రూపొందించారు. సుమారు 75 సెంట్ల విస్తర్ణంలో ఎంతో ఆకర్షణీయంగా పార్కును జీవీఎంసీ అధికారులు ఆధునీకరించారు. పార్కులో వివిధ రకాలకు చెందిన వందలాది మొక్కలను నాటుతున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్ర వేళల్లో వాకింగ్ చేసుకునేందుకు వీలుగా సుమారు ఐదు వందల అడుగుల ట్రాక్‌ను తీర్చిదిద్దారు. సాయంత్రం పూట సందర్శకులు ఆహ్లాదంగా కూర్చుని గడిపేందుకు గాను బల్లలతో పాటు రచ్చబండను ఏర్పాటు చేశారు. సందర్శకుల అవసరార్థం తాగునీటిని, టాయ్‌లెట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా పార్కులోకి పశువులు ప్రవేశించకుండా ప్రవేశ ద్వారం వద్ద గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బంది కూడా నియమించారు. ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న ఈ పార్కు త్వరలోనే స్థానికులకు అందుబాటులోకి రానున్నది.



60వ వార్డు ఎంఐజీ కాలనీలో ఆధునీకరించిన పార్కు

ఉద్యమాలతో మోదీ విధానాలను అడ్డుకుంటాం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జి.ఆనంద్

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 6: త్యాగాలతో స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జి.ఆనంద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,090వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో ప్రధాని మోదీ నియంత విధానాలను అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వ రంగాలపై కేంద్రం కక్ష సాధింపు చర్యలు తగవన్నారు. ఇప్పటికైనా ఉక్కుకు సొంత గనులు కేటాయించి, ప్రభుత్వ రంగంలో నడపాలని డిమాండ్ చేశారు. నాయకుడు నమ్మి సింహాద్రి మాట్లాడుతూ కార్పొరేట్ల చేతుల్లో పీఎం మోదీ కీలుబొమ్మగా మారారని విమర్శించారు. ప్రజల మనోభావాలతో ముడిపడివున్న స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించాలనుకోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, దేముడు, రమేశ్ వర్మ, పి.సోము నాయుడు, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీ పయనమైన ఉక్కు నిర్వాసితులు

ఢిల్లీకి నిర్వాసితులు, అఖిలపక్ష నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఈ నెల 7, 8 తేదీల్లో చేపట్టనున్న ధర్నాలో పాల్గొనేందుకు ఉక్కు నిర్వాసిత నాయకుడు జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో పలువురు నిర్వాసితులు, ఏఐటీయూసీ ప్లాంట్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు నేతృత్వంలో అఖిల పక్ష నాయకుల బృందం మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని వారు నినదించారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కాండ్రేగుల శ్రీనువాసులనాయుడు, కరణం సత్యారావు, పల్లా పెంటారావు, మంత్రి గోపి, రాజబాబు, తదితరులు ఉన్నారు.

గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన

గోపాలపట్నం, ఫిబ్రవరి 6: జీవీఎంసీ 89,91,92 వార్డుల్లో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మంగళవారం పర్యటించారు. పశ్చిమ నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. 91, 92 వార్డుల్లోని వెంకటాపురంలోని ఐదు మదాల సమస్య, శ్రీరామ్‌నగర్ గెడ్డ సమస్యలు, 91వ వార్డులోని రవీంద్రనగర్, పాతగోపాలపట్నంలో నెలకొన్న సమస్యలను జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆర్డీవోకు వివరించారు. అలాగే 89వ వార్డు చంద్రనగర్‌లో ఇటీవల అండర్ పాస్‌వే నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అండర్ పాస్‌వే నిర్మాణం జరిగిన చోట తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించినవారు ఇప్పుడు నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవాలని వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకాగోపి, కొత్తపాలెం సీపీసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు ఆర్డీవోకు విన్నవించారు. ఆయా సమస్యలును త్వరితంగా పరిష్కరించడానికి తగిన చర్యలు చేపడతామని ఆర్డీవో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ జెడ్సీకి వినతి

సింధియా, ఫిబ్రవరి 6: జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఎన్టీఆర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించవలసిందిగా వినతిపత్రం అందజేశారు. వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై జెడ్సీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్పొరేటర్ వెంట నాయకులు బీశెట్టి గణేశ్, రామకృష్ణ, అప్పలరాజు, పాస్టర్ ఇస్రాయల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'గాజువాక' అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గవర వెంకటరమణ మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం గాజువాకకు చెందిన పలువురు నాయకులతో కలిసి రాష్ట్ర కార్యదర్శికి ఆయన దరఖాస్తు అందజేశారు.

పేదలకు ఉపయుక్తం భారత్ రైస్ పథకం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 6: దేశంలో భారత్ రైస్ పథకాన్ని ప్రారంభించడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి పేర్కొన్నారు. దేశంలో బియ్యం ధరలు బాగా పెరిగిపోయాయని ఆందోళన చెందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించేలా విధంగా కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజలంతా ఆనందంగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.



శుభకార్యం నిర్వహణ కోసం పెదగంట్యాడ రహదారిపై వేసిన టెంట్లు, కార్పెట్

రహదారా.. కల్యాణ మండపమా.!

శుభ కార్యక్రమం కోసం 4వ తేదీ నుంచి రోడ్డును బ్లాక్ చేసిన నిర్వాహకుడు

గాజువాక, ఫిబ్రవరి 6: పెదగంట్యాడ జంక్షన్ వద్ద ప్రధాన రహదారి కల్యాణ మండపంగా మారింది. పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెలిముక్కు ప్రధాన రహదారిలో సుమారు కిలోమీటరు మేర ఓ వ్యక్తి శుభకార్యక్రమం కోసం భారీ ఎత్తున సెట్ వేశాడు. ప్రధాన రహదారిలో రాకపోకలు కొనసాగించలేని విధంగా టెంట్లు వేసి, కార్పెట్లు వేశారు. ఆదివారం సాయంత్రం నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. బుధవారం రాత్రి జరిగే శుభ కార్యక్రమం కోసం ఈ సెట్‌ను వేశారు. ఇక్కడ వేసిన సెట్‌ను తీసేందుకు మరో మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంటుందని.. మొత్తంమీద శుభ కార్యక్రమం కోసం వారం రోజుల పాటు రోడ్డును పూర్తిగా బ్లాక్ చేసేశారు. నిత్యం అధికారులు ఇదే మార్గంలో తిరుగుతున్నా రహదారి మూసివేతపై ఎలాంటి చర్యలు తీసుకోవకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా శ్రీనివాస్

అగనంపూడి, ఫిబ్రవరి 6: న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అగనంపూడికి చెందిన తలారి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ చేతుల మీదగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అసోసియేషన్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా ఆయనను స్థానిక టైలర్లు సత్కరించారు. కార్యక్రమంలో పుల్లయ్య నాయుడు, డీఎం. నాయుడు, డి.భాస్కరరావు, ఎ.సత్యనారాయణ, లక్ష్మి, నీలిమ, రేవతి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారామాంజనేయ చౌదరి

52 మందితో బీజేపీ నియోజకవర్గ ఎన్నికల కమిటీ నియామకం

గాజువాక, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల కోసం 52 మందితో భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ ఎన్నికల కమిటీని మంగళవారం నియమించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజేయ చౌదరి, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొని కమిటీ సభ్యులను నియమించారు. వాహనాల ఏర్పాట్లు, సభలు, సమావేశాలు, బూత్ నిర్వహణ, గణాంకాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమావేశాలు, పోస్టులు, మహిళా సమావేశాలు వంటి వాటి నిర్వహణపై నియామకాలు చేపట్టి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు సీతారామాంజనేయ చౌదరి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొలిమేర శ్రీను, ఎస్.నూకరాజు, దానేశ్, దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీను, సోంబాబు, ఎల్లాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 6: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా వుండే షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి రోడ్డు విస్తరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.40 లక్షలతో చేపట్టిన ఈ పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యవేక్షించారు. రహదారి విస్తరణ పనులను త్వరితంగా పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తేవాలని అధికారులు, కాంట్రక్టర్‌కు సూచించారు.

'కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలి'

మల్కాపురం, ఫిబ్రవరి 6: దేశంలో పరిశ్రమలు మనుగడ సాగించాలంటే కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ అంగ అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. నక్కవానిపాలెంలోని తమ నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంగ బానోజీ, నాయకులు డి.నూకరాజు, మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

న్యూపోర్టు సీఐకు అభినందనలు



సీఐ దాలిబాబును సత్కరించిన నాయకులు

గాజువాక, ఫిబ్రవరి 6: న్యూపోర్టు సీఐగా బాధ్యతలు చేపట్టిన దాలిబాబును మంగళవారం కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సీనియర్ నాయకుడు చెల్లుబోయిన నాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు సీఐను కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకునే చర్యలకు పార్టీ తరఫున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లి అప్పలరాజు, సాటి రవి, పోలవరపు రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

57వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 6: గ్రేటర్ 57వ వార్డు సాకేతపురంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు తనయుడు మార్యసింహ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంటకోట అజయ్‌బాబు, నరసింగరావు, రాజేశ్, సత్తిబాబు, చంద్రరావు, శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 50, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 18, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 22, అరటికాయ (పెద్దది) 4, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 86, బరబాటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 330, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28, కంద 54, దేముడుచిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	104
ఫారం ధర	--	124
విత్ స్కిన్	--	218
స్కిన్‌లెస్	--	224

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

జిల్లా గ్రంథాలయ సంస్థ అంచనా బడ్జెట్‌కు ఆమోదం

సీతమ్మధార, ఫిబ్రవరి 6: జిల్లా గ్రంథాలయ సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరాల సవరణబడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు సభ్యుల ఆమోదం లభించింది. రామాటాకీస్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం లో మంగళవారం సర్వ సభ్య సమావేశం చైర్మన్ కొండా రాజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లోని మౌలిక వసతులు, అభివృద్ధికి రూపొందించిన బడ్జెట్ అంచనాలు తదితర అంశాలపై చర్చించారు. సవరణ బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు సంబంధించిన పద్దులపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ జి.లక్ష్మణ రావు, డీపీవో కార్యాలయ ఏవో బీవీకే సత్యనారాయణ, వయోజన విద్యాశాఖ ఏడీడి.చిన్నికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సి హెచ్ వెంకటరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 6: అయిస్టా ఆధ్వర్యంలో సీఎంఆర్ అండర్-12, 14 బాలుర, బాలికల టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రా యూనివర్సిటీ టెన్నిస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈ టోర్నీని ఏపీ మాజీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వైస్ చైర్మన్ వైవీ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా క్రమం తప్పకుండా ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీతోపాటు వర్ధమాన ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్న అయిస్టా ప్రతినిధులు అభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అయిస్టా ప్రతినిధులు ప్రేమ్‌చంద్, డీఎస్ఎన్ రాజు, టోర్నీ నిర్వాహక కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు, రామారావు, డాక్టర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ

ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధిగా 'సుందరపు'



నియామకమ పత్రమిస్తున్న పవన్ కల్యాణ్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 6: జనసేన పార్టీ ఉత్తరాంధ్ర పార్టీ ముఖ్య ప్రతినిధిగా సుందరపు సతీష్‌కుమార్‌ను ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ నియమించారు.ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉత్తరాంధ్రప్రాంతంలో పార్టీ అభివృద్ధికి పాడాలని పవన్ కల్యాణ్ సూచించారు.

నేడు బాబా ఆలయ వార్షికోత్సవం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 6 : స్థానిక ఎనభై అడుగుల రోడ్డు రామచంద్రనగర్‌లోని శివసాయి ఆలయం 25వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్టు శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు శరగడం అప్పారావు తెలిపారు. ఉదయం 5 గంటల సాయిబాబాకు మేలుకొలుపు పాటలు, కాకడ హారతితో ప్రారంభమవుతుందన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



నిర్వాహకుడు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న గంటా

మద్దిపాలెం, ఫిబ్రవరి 6: మద్దిపాలెంలో టీడీపీనాయకుడు పోలమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు ట్రస్ట్ సహకారంతో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరానికి విచ్చేసిన ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు శ్రీభరత్..శ్రీనివాసరావును అభినందించారు. ఈ శిబిరంలో సుమారు 92 యూనిట్ల రక్తం ఎన్‌టీఆర్ ట్రస్ట్ వైద్య సిబ్బంది సేకరించారు. ఈసందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని తలపెట్టాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోలమరశెట్టి నర్సకుమారి, విశాఖ పార్లమెంట్ నాయకుడు సనపల వరప్రసాద్, 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్ కుట్టా, వార్డు అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు కంచరాపు శ్రీని వాసరావు, డీవీ శ్రీనివాసరావు, రాపేట్ అశోక్, హరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లీ కరుణించమ్మా...!

» ఫిషింగ్ హార్బర్‌లో సముద్రానికి హారతి



కలశాలతో వెళ్తున్న మహిళలు

మహారాణిపేట, ఫిబ్రవరి 6: ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మతల్లికి హారతి పూజలు, అభిషేకాలను మంగళవారం ఘనంగా నిర్వ హించారు. హార్బర్‌లో గత నవంబరులో అగ్ని ప్రమాదం సంభవించినచోటకు ఏపీ మెకా నైజ్‌డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్సు అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంనుంచి పెద్దఎత్తున మహిళలు కలశాలతో ఊరే గింపుగా వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా జానకీరామ్ మాట్లాడుతూ నవంబర్‌లో హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తర్వాత చేపలవేట తగ్గుముఖం పట్టిందన్నారు. ఈనేపథ్యంలో గంగమ్మతల్లి ఆశీస్సులతో భవిష్యత్తులో ఏ ప్రమాదాలు జరగకుండా, విశాఖ నగరాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల 4 వ తేదీ నుంచి యజ్ఞం, శాం తి హోమం, తదితర పూజలు మూడురోజులుగా నిర్వహించినట్టు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయంనుంచి ఊరేగింపుగా వెళ్లి హార్బర్‌లో గంగమ్మతల్లికి, మత్స్య నారాయణునికి పూజలు చేశామన్నారు.మహిళలు అమ్మవారికి కలశాభిషేకం చేశారన్నారు. వ్యాపారకలాపాలు యథావిధిగా సాగాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీ బొత్స ఝాన్సీ, అక్కరమాని విజయనిర్మల, మత్స్య కార సంఘాల నేతలు పాల్గొన్నారు.



హారతి సమర్పిస్తున్న మత్స్యకారులు

భూ హక్కు యాజమాన్య చట్టం రద్దుపై మొండి వైఖరి తగదు

» రహదారిని దిగ్బంధించి న్యాయవాదుల నిరసన

» సీఎం జగన్, మంత్రి ధర్మాన దిష్టిబొమ్మల దహనం

మహారాణిపేట, ఫిబ్రవరి 6: ప్రజా వ్యతిరేక భూ హక్కుల యాజమాన్య చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. భూహక్కుల యా జమాన్య చట్టం రద్దు కోరుతూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 50 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం స్పందించకపోవటంతో న్యాయవాదులు రహదారిపైకి వచ్చిన రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన, ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రహదారి దిగ్బంధంతో జగదాంబ, అటు జైలు రోడ్డు వరకు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి.



జిల్లా కోర్టు ఎదుట రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులు

అనంతరం న్యాయవాది పలకా శ్రీరా మూర్తి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తం గా అన్ని రాష్ట్రాలు ఈ చట్టాన్ని వ్యతిరేకించినా, కేవలం ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. ప్రజల వ్యక్తిగత ఆస్తులకు రక్షణ లేని ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జి సురక్షితమేనా!?

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారు. కానీ కురుసుర వద్ద అలలు ఒక్కోసారి బలంగా తీరాన్ని తాకుతాయి. అంతేకాదు. ఆ ప్రాంతంతో తీరం తరచూ కోతకు గురవుతుంటుంది. కురుసుర మ్యూజియం ప్రహరీ కూడా అలల ధాటికి కూలిపోయిన సందర్భాలు ఉన్నాయి. జీవీఎంసీ అధికారులే తీరాన్ని పటిష్ఠం చేసే పనులు చేపట్టారు. అలాగే ఆ ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు 'ఇచ్చట ఈతకు సముద్రంలో దిగరాదు..ప్రమాదకరం' అనే హెచ్చరిక బోర్డులు కూడా ఉన్నాయి. ఇంకా...ఇప్పుడు ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుచేసిన స్థలం పక్కన మురుగు కాలువ ఉంది. ప్రస్తుతం అది ఎండిపోయినట్టుగా ఉన్నా...వర్షం పడితే నగరంలో మురుగునీరంతా అక్కడే సముద్రంలో కలుస్తుంది. అయితే అనుమతులు గట్రా అంటే...మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుందని అధికార పార్టీకి క్రెడిట్ దక్కదని అధికారులు ఆలోచిస్తున్నారు తప్ప...కాసింత ఆలస్యమైనా సురక్షితమైన ప్రాంతంలో పెట్టాలనే ప్రయత్నం చేయడం లేదు.

గతంలోను అంతే!!

ఆరు నెలల క్రితం తెన్నేటి పార్కు ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో అధికార పార్టీ నేతలు చెప్పిన వారికి దుకాణాల కేటాయింపునకు ఏకంగా కైలాసగిరినే తవ్వేశారు. దీనిపై పలువురు హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చారు. అది అమలులో ఉండగానే రాత్రికి రాత్రి పనులు పూర్తిచేసేశారు. చెట్లు కొట్టడానికి, కొండను తవ్వడానికి కూడా ఏ శాఖ అనుమతి తీసుకోలేదు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

» ఏడీసీ విశ్వనాథన్



41వవార్డులో పర్యటిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

జ్ఞానాపురం, ఫిబ్రవరి 6: గ్రేటర్ 41వ వార్డు పరిధిలోని సెబాస్టియన్ కాలనీ, జేఎస్ఎన్ఎంఆర్‌యూ కాలనీల్లో మంగళవారం జీవీఎంసీ అద నపు కమిషనర్‌విశ్వనాథన్ పర్యటించారు. కాలనీల్లో రోడ్లు, పారిశుధ్య పనులను పరిశీలించారు.స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 24 గంటల నీటిసరఫరాల కోసం తవ్విన గోతులను పూడ్చాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలని కోరారు. పారిశుధ్య పనుల్లోఅలసత్వం వహించొద్దని అధికారులను ఆదేశించారు. ఆయన వెంటజడ్పీ ఆర్.జి.వి. కృష్ణ, సహాయ వైద్యాధికారి సునీల్ కుమార్, ఈఈ మత్సరాజు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయ ఆవరణలో గండి బాబ్జీ

జ్ఞానాపురం, ఫిబ్రవరి 6: అల్లిపురం చెరువుగట్టు సమీపంలోని శ్రీఅరుణ లింగేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనం గా నిర్వహించారు. టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దాసన సత్యనారాయణ, ఈగలపాటి అప్పారావు, ఆలయ ధర్మకర్త వి.వెంకటేశ్వరరావు, రమేష్, నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమా ఉత్సవాలు ప్రారంభం



చిత్ర దర్శకులు హెచ్‌ఎం రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 6: తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 92 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆచార్య ఎన్‌వీఎస్ దుర్గాప్రసాద్‌రావు ఈ ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ముందుగా భక్త ప్రహ్లాద చిత్ర దర్శకులు హెచ్‌ఎం రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆచార్య దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ మానవతా విలువలను పెంపొందించే సినిమాలు ప్రజలకు చేరువ కావడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈ ఉత్సవం సినిమా పరిశ్రమ జరుపుకోవాల్సి ఉందన్నారు. 1955లో విడుదలైన బంగారు పాప చిత్రాన్ని ప్రదర్శించారు. సమావేశంలో చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, హంస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, ఉషారాణి, అర్చన, కష్టారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

సిటీలో మెట్రో సర్వీసులు ఇక ఉండవ్

... 5వ పేజీ తరువాయి

వినియోగించేందుకు అధికారులు నిర్ణయించారు.

జోన్ పరిధిలోని ప్రాంతాలకు

విశాఖ రీజియన్ నుంచి విజయనగరం జోన్ పరిధిలోని దూర ప్రాంతాలకు మెట్రో సర్వీసులు ఎక్కువగా నడపాలని అధికారులు భావిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకు, విజయనగరం జిల్లాలోని విజయనగరం, సాలూరు, బొబ్బిలి, శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, రాజాం, పలాస, టెక్కలి, సోంపేట వంటి ప్రాంతాలకు మెట్రో సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక తయారుచేశారు. ఈ మేరకు షెడ్యూల్స్ కూడా ఖరారు చేశారు. ఈ ప్రాంతాలకు ప్రస్తుతం డీలక్స్, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ, సర్వీసులతో పాటు మెట్రోలు కూడా నడుస్తున్నాయి. ఈ రూట్లలో మరిన్ని మెట్రో సర్వీసులు నడిపేందుకు అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

అన్ని స్టాపుల్లో అన్ని బస్సులు ఆగుతాయి

అంధవరపు అప్పలరాజు, రీజనల్ మేనేజర్, విశాఖ రీజియన్

సిటీ పరిధిలోని ప్రయాణికులకు పూర్తిస్థాయిలో రవాణా సేవలందించాలనే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. పాస్ హోల్డర్స్‌కు, రాయితీ పాస్‌హోల్డర్లకు, ఉచిత బస్‌పాస్‌లు కలిగిన వారికి ఆర్డినరీ బస్సు ఎక్కేందుకే అవకాశం ఉంది. ఇవి అన్ని స్టాపుల్లోను, రిక్వెస్టు స్టాపులోను ఆగుతాయి. కనుక ఎటువంటి ఇబ్బంది ఉండదు.

పట్టు వదలని తిప్పల నాగిరెడ్డి

టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు

గాజువాక, ఫిబ్రవరి 6: గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా వైసీపీ అధిష్ఠానం ఉరుకూటి రామచంద్రరావును నియమించినప్పటికీ టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. గాజువాక అభ్యర్థి రామచంద్రరావేనని గత వారం ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి బహిరంగంగా ప్రకటించారు. ఆ మరుసటిరోజే నాగిరెడ్డి తన అనుచరులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినంత మాత్రాన.. అతనే అభ్యర్థి అవుతాడన్నది ఎక్కడా లేదని, గతంలో బీఫామ్ ఇచ్చిన తరువాత కూడా క్యాండెట్లను మార్చిన సందర్భాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. తాజాగా ముఖ్య నేతలను కలిసేందుకు తన ఇద్దరు కుమారులతో పాటు అనుచర వర్గాన్ని తీసుకుని అమరావతి తీసుకువెళ్లారు. మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజనిలను కలిసి టికెట్ తనకే కేటాయించాలని కోరారు. ఒకవేళ తమకు ఇవ్వని పక్షంలో తాము సూచించిన వ్యక్తికి ఇవ్వాలని పట్టుబట్టారు. ప్రధానంగా విశాఖ ఎంపీ టికెట్ బొత్స ఝాన్సీకి కేటాయించే అవకాశం ఉండడంతో తిప్పల అనుచర వర్గం మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి నాగిరెడ్డికి టికెట్ కేటాయిస్తే విజయం తథ్యమని తెలిపారు. ఇందుకు బొత్స స్పందిస్తూ జగన్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

జగన్ అపాయిట్‌మెంట్ కోసం యత్నం

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసేందుకు ఎమ్మెల్యే నాగిరెడ్డి యత్నిస్తున్నారు. ఒకవేళ అపాయిట్‌మెంట్ లభిస్తే తన అనుచరవర్గంలోని కార్పొరేటర్‌లు, ముఖ్యమైన నేతలతో వెళ్లి టికెట్ అడగాలని భావిస్తున్నారు. నాగిరెడ్డికి మద్దతుగా అమరావతి వెళ్లిన వారిలో కార్పొరేటర్‌లు భూపతిరాజు సుజాత, బొడ్డు నరసింహమూర్తి, ఇమ్రాన్, రాజాన రామారావు, తిప్పల వంశీరెడ్డి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, పార్టీ వార్డు అధ్యక్షులు ఉన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

మద్దిపాలెం, ఫిబ్రవరి 6: మద్దిపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 8 ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు అర్బన్ సీడీపీఓ రమణకుమారి తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా నేరుగా గాని పో స్టుద్వారాగాని మద్దిపాలెం ఆర్‌అండ్‌బీ జంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు విశాఖపట్నం కార్యాలయానికి చేరాలన్నారు.

16న రవాణా రంగం బంద్



మాట్లాడుతున్న సీఐటీయూనేత కుమార్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 6: రవాణా రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16 తేదీన క్యాబ్ యూనియన్ తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేసీ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సిటు కార్యాలయంలో క్యాబ్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో రవాణా రంగాన్ని నమ్ముకొని 6 కోట్ల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రంగంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరితో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. సిటు నాయకులు బి.జగన్, క్యాబ్ యూనియన్ నాయకులు సిహెచ్ శ్రీనివాస్, పోలినాయుడు,మోటారు యూనియన్ ప్రధానకార్యదర్శి జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం కళకళ

... 5వ పేజీ తరువాయి

విమాన సర్వీసుల ఉండేవి. ఆ తరువాత ఒక్క సింగపూర్ విమాన సర్వీసు మాత్రమే పునరుద్ధరించారు. ఇది వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. తాజాగా ఎయిర్ ఏసియా ముందుకు రావడంతో కొత్తగా బ్యాంకాక్‌కు ఓ సర్వీసు వచ్చింది. ఇది ఏప్రిల్ నుంచి నడుస్తుంది. అలాగే మలేషియాకు కూడా మరో సర్వీసు ప్రకటించింది. ఇవి కూడా వారానికి మూడు రోజులు నడుస్తాయి. అంటే ఏప్రిల్ నుంచి ప్రతి రోజూ విశాఖ నుంచి విదేశీ విమానం ఎగురుతుంది. త్వరలో శ్రీలంక, తదితర దేశాలకు సర్వీసులు వస్తాయని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం చెబుతోంది.

అందుబాటులోకి డిజి యాత్ర యాప్

విమాన ప్రయాణికులకు చెకింగ్ సమయం తగ్గించేందుకు డిజి ఫౌండేషన్ 'డిజి యాత్ర' పేరుతో యాప్‌ను రూపొందించింది. ఇది ఏప్రిల్ నుంచి విశాఖపట్నంలో అందుబాటులోకి వస్తుంది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే విమాన ప్రయాణం చేసేటపుడు ఆధార్ వివరాల ఆధారంగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా సెక్యూరిటీ చెక్ నుంచి తక్కువ సమయంలో విమానాశ్రయం లోపలకు వెళ్లొచ్చు. బోర్డింగ్ పాస్‌పై బార్ కోడ్‌ని స్కాన్ చేయగానే ప్రయాణికుడి వివరాలన్నీ లగేజ్ చెకింగ్ కౌంటర్‌లో డిస్‌ప్లే అవుతాయి. అక్కడ కూడా అతి తక్కువ సమయంలో చెకింగ్ పూర్తయిపోతుంది. లోపల సెక్యూరిటీ చెక్‌కు ముందే జరిగే ప్రాసెస్ అంతా చాలా తక్కువ సమయంలో ఏ పత్రాలు చూపించకుండానే ముగుస్తుంది. ఇది పెద్ద విమానాశ్రయాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఏప్రిల్ నుంచి విశాఖపట్నంలో ప్రారంభిస్తామని విమానాశ్రయం ఇన్‌చార్జి డైరక్టర్ తెలిపారు.

జూలై నుంచి దుబాయ్ సర్వీసు

- ఓ.నరేశ్‌కుమార్, ఏపీ విమాన ప్రయాణికుల సంఘం

విశాఖపట్నం నుంచి మొదట దుబాయ్‌కే విమాన సర్వీసు మొదలైంది. ఆ తరువాతే సింగపూర్, మలేషియా, శ్రీలంక సర్వీసులు వచ్చాయి. ఇప్పుడు దుబాయ్ సర్వీసు అందుబాటులో లేదు. దీనిని జూలై నుంచి పునరుద్ధంచే ప్రయత్నాలు సఫలమయ్యాయి. కొత్త షెడ్యూల్‌లో దీనిని ప్రకటిస్తారు.

హెచ్‌ఎంలపై పాఠశాలల నిర్వహణ భారం

... 5వ పేజీ తరువాయి

జిల్లాలో సగం పాఠశాలలకు గ్రాంటు ఇచ్చి... మిగిలిన పాఠశాలలకు ఇవ్వలేదు. నిర్వహణ గ్రాంటు లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడు తున్నారు. నాడు-నేడు కింద జిల్లాలోని పాఠశాలల్లో ప్రధానంగా ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మంచినీటి సరఫరా ట్యాప్‌లు, ఫ్లోరింగ్ మరమ్మతుల కోసం రూ.2.6 కోట్లు విడుదల చేశారు. అయితే ఈ నిధులు కేవలం మరమ్మతు లకు తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించ వద్దని ప్రభుత్వం తేల్చిచెప్పింది. దీంతో పాఠశాలల నిర్వహణ తలకు మించిన భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపో తున్నారు. నగరంలోని చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో రోజువారీ తరగతుల నిర్వహణకు సుద్దముక్కల ఖర్చు హెచ్‌ఎం భరించాల్సి వస్తోంది.

విద్యుత్ బకాయిలపై ఒత్తిడి లేకుండా ఆదేశాలివ్వాలి

- ఈ.పైడిరాజు, ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ విశాఖ జిల్లా శాఖ

ఉన్నత పాఠశాలలకు ప్రతి నెలా రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తోంది. దీనికితోడు అదనంగా వాడిన విద్యుత్‌కు తాజాగా బిల్లులు పంపుతున్నారు. దీంతో హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యుత్ బిల్లుల చెల్లింపుల నుంచి పాఠశాలలకు మినహాయింపు ఇచ్చేలా ఉత్తర్వులు జారీచేయాలి. బకాయిలు చెల్లించలేదని విద్యుత్ నిలిపివేస్తే పరీక్షల వేళ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

విమ్స్‌లో వైద్యుల పోస్టుల భర్తీకి 9న ఇంటర్వ్యూ

ఆరిలోవ, ఫిబ్రవరి 6: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఉత్తీర్ణత శాతం, రూల్‌ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అనస్థీషియా ఐదు, న్యూరోసర్జరీ-1, న్యూరాలజీ-2, కార్డియాలజీ-1, సర్జికల్ ఆంకాలజీ-2, ఎమర్జెన్సీ మెడిసిన్-1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)-3, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-12, మెడికల్ ఆంకాలజీ-1, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండ్రోక్రైనాలజీ-1, పల్మనాలజీ-1 ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

రక్షణ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలి

నేవీ ప్రాజెక్ట్స్ డైరక్టర్ జనరల్ శ్రీనివాసన్



శ్రీనివాసన్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మురళీనగర్, ఫిబ్రవరి 6 ; భారత రక్షణ రంగంలో మరింతగా ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలని డైరెక్టర్ జనరల్ నేవీ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జి.శ్రీనివాసన్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ జంక్షన్ మారియట్ హోటల్ వేదికగా సీఐఐ సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం), డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్, డిఫెన్స్ మినిస్ట్రీలసౌజన్యంతో ఎంఎస్ఎంఇ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీనివాసన్ మాట్లాడారు. భారత నౌకాదళంలో అధిక శాతం ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం ఉన్నందున ఈ దిశగా స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం, ఆర్డినెన్స్ డెలివరీ, మెయింటెనెన్స్, జీవనోపాధి లక్ష్యాలను నెరవేర్చడంలో ఎంఎస్ఎంఇల పాత్రను వివరించారు. ఏపీ వాణిజ్య, పరిశ్రమల శాఖ సెక్రటరీ డాక్టర్ ఎన్.యువరాజ్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఇ పార్కు స్థాపనకు నామమాత్రపు ధరలకు భూమిని కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. టి డాక్ ఆఫీసర్ ఇన్‌చార్జి కమొడోర్ ఎస్.కె.సింగ్, ఈస్ట్రన్ నేవల్ కమాండ్ సీఎస్‌వో నెల్సన్ డిసౌజా, ప్రీతమ్ లాల్, కె.టి. మిధున్, ఎస్‌బీసీ, హెచ్ఎస్ఎల్, బెల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి రెండు వారాలు రిమాండ్

కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడు మురహరి సుబ్రహ్మణ్యం గంగారావుకు కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించింది. విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పని చేసి విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ అయిన రమణయ్యను ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటల సమయంలో సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుప రాడ్‌తో కొట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన తర్వాత చెన్నై పారిపోయిన నిందితుడిని నగర పోలీసులు సోమవారం అక్కడ అరెస్టు చేసి ఇక్కడకు తీసుకొచ్చారు. సుమారు 20 గంటలపాటు గంగారావును విచా రించిన పోలీసులు...మంగళవారం కోర్టులో హాజరుపరిచగా రెండు వారాలు రిమాండ్ విధించింది.పెదరుషికొండ ప్రాంతంలో ఒక అపార్టుమెంట్ నిర్మించిన స్థలానికి సంబంధించి కన్వేయెన్స్ డీడ్‌ను రమణయ్య జారీ చేయలేదనే హత్యకు తెగబడినట్టు నిందితుడు పోలీసుల విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. తన పని చేయకుండా జాప్యం చేశారనే కోపంతో రాడ్‌తో కొట్టాలనుకున్నానని, ప్రాణాలు తీయాలని మాత్రం అనుకోలేదని నిందితుడు చెప్పినట్టు సమాచారం. తహసీల్దార్‌పై దాడి చేసిన తర్వాత ఆయన ప్రాణాలతో ఉన్నాడనే భావనతో తాను నేరుగా ఇంటికి వెళ్లిపోయానని పోలీసులకు వివరించినట్టు తెలిసిం ది.తహసీల్దార్ ప్రాణాలు కోల్పోయినట్టు తెలి యడంతో నగరంనుంచి పరారైనట్టు తెలి పాడు. కాగా ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లడానికి ఎవరు సహకరించారు?, కన్వేయన్స్ డీడ్ పని ఎవరు అప్పగించారు?, ఆర్థికపరమైనలావాదేవీల కు సంబంధించిన సమాచారాన్ని నిందితు డు రకరకాలుగా పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో ఈ కేసులో మరిన్ని వివరాలు రా బట్టాల్సి ఉన్నందున నిందితుడిని నాలుగు రోజులపాటు కస్టడీకి అప్పగించాలని పీఎం పా లెం పోలీసులు కోర్టులో పిటిషన్ వేసినట్టు తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రం పనులు పరిశీలన

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 6: గ్రేటర్ 46వ వార్డు సూరిబాబు నగర్‌లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఈ అంగన్‌వాడీ భవంన శిథిలావస్థకు చేరడంతో దీన్ని పునర్నిర్మానానికి జీవీఎంసీ నిధులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా చెప్పారు. నాణ్యతతో నిర్మాణం పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జి.అప్పారావు, ఎస్.కృష్ణ, ఎస్.రామారావు, కె.లావణ్య, ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు ఉన్నారు.

రేషన్ కోసం రోడ్లపై పడిగాపులు

- పేరుకే ఇంటింటికీ వాహనాలు
- రోడ్డుపైనే నిలిపివేస్తున్న నిర్వాహకులు
- గంటల కొద్దీ కార్డుదారుల నిరీక్షణ
- డిపోల్లోనే సరకులు ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ తీరుపై మండిపాటు


ఇసుకతోటలో ఉదయం 8.30 గంటలకు ఇలా...


16వ వార్డులో మధ్యాహ్నం 2.30 గంటలకు...

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 6: రాత్రిం బవళ్లు రేషన్ సరుకుల కోసం వెహికల్ వద్ద రోడ్డుపై పడిగాపులు కాయాల్సిన దుస్థితి. ఇంటింటికి రేషన్ పేరిట ఏర్పాటు చేసిన వాహనాలు కనీసం మెయిన్ రోడ్డులో ఉన్న ఇళ్లకు కూడా రేషన్ అందించలేని దుస్థితి. మెయిన్ రోడ్డుపై ఇళ్లు ఉన్నా దూరాన ఉన్న రేషన్ వెహికల్ దగ్గరకు వెళ్లి అందులో ఇచ్చే బియ్యం, పంచదారను విడిపించుకున్నారు. అందుబాటులో రేషన్‌ను అందించలేకపోయిన కనీసం పూర్తి స్థాయిలోనైనా రేషన్‌ను (బియ్యం, కందిపప్పు, పంచదార, గోదుమపిండి) లను పంపిణీ చేస్తే బాగున్నని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమి ప్రభుత్వం, ఇదేమి పద్ధతని వారు ప్రశ్నిస్తున్నారు. ఇచ్చే బియ్యం, పంచదార కోసం సర్వర్ పనిచేయక రోడ్లపై పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ సమయపాలన లేకుండా రేషన్ వెహికల్‌ను ఏర్పాటు చేయడం వలన తాము ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. అందరూ ఇళ్లలో క్యారేజీలు కట్టుకునే సమయం ఉదయం 7 నుంచి 9, సేద తీరే సమయం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ వె హికల్‌ను ఏర్పాటు చేయడం వలన తమ పనులు సజావుగా సాగక, అలా అని విడిపించకపోతే, మరింత దూరప్రాంతాలకు వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన దుస్థితి. ఇంకా ఆలస్యమైన బియ్యం మాత్రమే కొనుగోలు చేసుకునే పరిస్థితి. ఇదేమిటి, ఇదేమి పద్ధతి అని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత

మాకెందుకు ఈ దుస్థితి



రేషన్ కోసం ఉదయం నుంచీ మూడు సార్లు తిరిగాను.. గతంలో డిపో వద్ద సరకులు ఇచ్చేటప్పుడు నాకు వీలైన సమయంలో వెళ్లి తీసుకునేదాన్ని. ఇప్పు డు కనీసం మాలాంటి ముసలివారి ఇళ్లకైనా సరకులు తెచ్చి ఇవ్వాలి కదా.. ఇంటికి తేకపోగా, వాహనం వద్ద కు మూడు నాలుగు సార్లు తిరగాల్సి వస్తోంది. 80 ఏళ్ల వయసులో మాకెందుకు ఈ దుస్థితి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

\- యశోద, వృద్ధురాలు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఫిబ్రవరి 6: వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం సహస్రనామ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్యకల్యాణం తదితర ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పవేదికపై అధిష్టింపజేశారు. ఉదయం 9.30గంటలకు ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

తాడేపల్లిగూడెం వెళ్లిన ప్రచార రథం

అప్పన్న ఆలయ ప్రచారం కోసం సింహాచలం దేవస్థానం ప్రచార రథం మంగళవారం తాడేపల్లిగూడెం బయలుదేరింది. ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత సహాయ కార్యనిర్వాహణాధికారి భ్రమరాంబ లాంచనంగా రథాన్ని ప్రారంభించారు. బుధవారం తాడేపల్లిగూడెం చేరుకుని పదో తేదీ వరకు పరిసర ప్రాంతాల్లో ధర్మప్రచారాన్ని నిర్వహించనుంది. 11న బలుసమ్మతల్లి దేవాలయ వద్ద సింహాద్రినాథుని శాంతి కల్యాణం నిర్వహించిన తరువాత తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నిత్యాన్న ప్రసాద పథకానికి సీతమ్మధార ప్రాంతానికి చెందిన పాసి ఆనందరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,11,116ను చెక్కును పర్యవేక్షణాధికారులు పిళ్లా శ్రీనివాసరావు, సిరిపురపు కనకరాజులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సింహాచలం, ఫిబ్రవరి 6: విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఆర్టీసీ సింహాచల డిపో మేనేజర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం దేవస్థానం సంస్కృత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఇటీవల రహదారి ప్రమాదాలు సంఖ్య పెరిగిందని, నిబంధనలను ఉల్లంఘించి ప్రయాణాలు సాగించడమే కారణమన్నారు. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జీబ్రా లైన్స్ మీద, ఎడమవైపు మాత్రమే నడవాలని, ట్రాఫిక్ కూడళ్లలో సిగ్నల్స్‌ను గమనిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాను, డిపో అసిస్టెంట్ మేనేజర్ సాయి తులసీ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిట్టివలసలో వైద్య శిబిరం

తగరపువలస, ఫిబ్రవరి 6: గీతం వైద్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం చిట్టివలస బంతాట మైదానంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు టీడీపీ జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్ తెలిపారు. నిపుణులు రోగులకు పరీక్షలు జరిపి మందులను అందిస్తారన్నారు. కార్యకర్తల ఆధ్వర్యంలో శిబిరం కొనసాగుతుందన్నారు.

కరాటే విజేతలకు అభినందన

భీమునిపట్నం, ఫిబ్రవరి 6: నగరంలోని అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో జరిగిన 7వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో భీమిలి ది సన్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, కోచ్ రెమోను అభినందించారు. ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన ఈ పోటీలలో పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బి.కోమలి కరాటే కుమిటి విభాగంలో గోల్డ్ మెడల్, కరాటే కాతా విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. రెండవ తరగతి చదువుతున్న జి.యువన్ కరాటే కుమిటిలో సిల్వర్ మెడల్, కరాటే కాతాలో గోల్డ్ మెడల్ సాధించారని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, ఫిబ్రవరి 6: భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఎం.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 2, సహాయకురాలి పోస్టులు 18 ఖాళీగా వున్నాయన్నారు. అర్హులు ఈనెల 15లోగా ప్రాజెక్టు కార్యాలయంలో దఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 19, టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 50, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 22, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 330, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	104
ఫారం ధర	--	124
విత్ స్కిన్	--	218
స్కిన్‌లెస్	--	228

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

పార్కులను సత్వరం పూర్తిచేయండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


క్రీడాపార్కును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

కొమ్మాది, ఫిబ్రవరి 6: ప్రజలకు ఆహ్లాదం పంచడంతోపాటు వారు సేదతీరేందుకు పార్కుల నిర్మాణం అవసరమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అన్నారు. జోన్-2 పరిధి బక్కన్నపాలెం లచ్చిరాజు లేఅవుట్‌లో నిర్మిస్తున్న స్పోర్ట్సు పార్కును ఎం.ఎస్.ఆర్ లేఅవుట్‌లోని పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పోర్ట్సు పార్కు 80శాతం పనులు పూర్తయ్యాయని, పచ్చదనం పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీ పార్కులో ఆకర్షణీయమైన మొక్కలు, వాకింగ్‌ట్రాక్ మరమ్మతులతో పాటు పార్కు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్ఈ శ్యామ్‌సన్‌రాజు, ఏడీ హెచ్ చక్రవర్తి, జెడ్సీ డి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

భీమునిపట్నం, ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ఇంటివద్దే ఓటు వేసే అవకాశాన్ని 80 ఏళ్లు దాటిన వృద్ధులు సద్వినియోగంచేసుకోవాలని భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కర్‌రెడ్డి కోరారు. మంగళవారం అఖిలపక్ష నాయకులతో ఓటర్ల జాబితా సవరణలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాబితాలో పేరుండి, 80 ఏళ్ల వయసు దాటి నడవలేని స్థితిలో ఉన్న వారికి అప్లికేషన్ విధానం ద్వారా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. వారి వివరాలు అందించాలని రాజకీయ పక్షాలను కోరారు. నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులూ ఈ విధానాన్ని వినియోగించుకోవచ్చన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గోవింద్, ఎన్నికల డీటీ భాస్కరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, భీమిలి ఎంపీపీ దంతులూరి అప్పలనరసింహరాజు. వైసీపీ నాయకులు బోని బంగారునాయుడు, గాడు శ్రీను, జనసేన నేత వాసుపల్లి అనిల్, కాంగ్రెస్ నాయకులు పల్లా వెంకటరావు, పడాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి:

ఆరిలోవ: చినగదిలి రూరల్ మండల కార్యాలయాన్ని ఆర్‌డీవో భాస్కర రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ, జగనన్న కాలనీ స్థలాల ఎంపిక ప్ర క్రియ వేగవంతంగా చేయాలన్నారు. మండలంలో సుమారు 25 వేలమంది ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేశారన్నారు. లబ్ధిదారులకు సత్వరంగా మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన


రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆరిలోవ, ఫిబ్రవరి 6: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం హనుమంతవాక ప్రధాన జంక్షన్ వద్ద మోటారు రవాణా శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా వాహన చోదకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంవీఐ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రహదారి భద్రత పాటించాలన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహన చోదకుడు వాహనం నడిపినపుడు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పాటిచాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అతి వేగంగానడపరాదని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వేణుగోపాలరావు, బుచ్చిరాజు, మన్మోహన్, మాధవి, రాజారావు, శిరీషాదేవి, శిరీష, సుమన్‌కుమార్, శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీ ఎంవీవీ


సూర్యతేజనగర్ సెంటర్ లైటింగ్ ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

పెదవాల్తేరు, ఫిబ్రవరి 6: వార్డు పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. 19వ వార్డు పెదజాలారిపేటలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పెదజాలారిపేట గ్రామ పెద్దల నుంచి సమస్యలను తెలుసుకుని మధ్యాహ్నం స్థానికులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సూరాడ వెంకట లక్ష్మిదాసు పేర్ల విజయచంద్ర, వాడమోదుల గణేష్ చెప్రో వసంత, గ్రామ పెద్దలు కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ 11, 12 వ వార్డు పరిధి సూర్యతేజనగర్. శ్రీకాంత్‌నగర్ ల వద్ద రూ.5.8 కోట్లతో నిర్మించిన వంతెన, సెంటర్ లైటింగ్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, 11వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం తోటగరువు వద్ద బ్రిడ్జి నిర్మాణంతోపాటు రింగ్ రోడ్డుపనులు చేపడుతున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సేవా భావంతోనే నర్సింగ్ వృత్తిలో రాణింపు

- జిమ్‌సర్ ప్రో వీసీ డాక్టర్ గీతాంజలి


కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేస్తున్న గీతం నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

ఎండాడ, ఫిబ్రవరి 6: నర్సింగ్ వృత్తిని సేవా భావంతో నిర్వహిస్తేనే రాణిస్తారని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, నర్సింగ్ విద్యలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడమే సంస్థ లక్ష్యమని ఆమె వివరించారు. వైద్య ఆరోగ్య రంగం విస్తరిస్తున్న కొద్దీ నర్సింగ్ వృత్తికి ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు లభిస్తున్నాయన్నారు. జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్వీ రావు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవతి మాట్లాడుతూ వృత్తి విలువలను కాపాడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేషన్ మాట్లాడుతూ ఏపీ, కేరళ, తమిళనాడు, ఒడిశా, మణిపూర్, వెస్ట్ బెంగాల్, రాష్ట్రాల నుంచే కాకుండా నేపాల్ వంటి దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. వృత్తిని అంకిత భావంతో చేపడతామని విద్యార్థినులంతా కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేశారు.

వార్డు అభివృద్ధికి విశేష కృషి : కార్పొరేటర్ హేమలత


సెంట్రల్ లైటింగ్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

కొమ్మాది, ఫిబ్రవరి 6: తెలుగుదేశం పార్టీ అధికారంలో లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత పేర్కొన్నారు. వార్డు పరిధి జె.యన్.యన్.యూఆర్ఎమ్ కాలనీ, పీపీ కాలనీ, పరదేశిపాలెం రాజీవ్‌గృహకల్ప, మారికవలస, వైఎస్ఆర్ కాలనీ, సాయిరాంకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, నగరంపాలెం తదతర ప్రాంతాల్లో రూ.19 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపాల ఏర్పాటుతో స్థానికుల సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. శివారుప్రాంతంలో కొత్తకాలనీలు ఏర్పాటు కావడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించడంతో పాటు, కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 6: జీవీఎంసీ మెప్మా ఆధ్వర్యంలో 60 మంది స్వయం సహాయక సంఘం సభ్యులకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్టు యూసీడీ పీడీ పాపునాయుడు తెలిపారు. అనూష్ సంస్థ సహకారంతో బుధవారం నుంచి 13 వరకు ద్వారకానగర్‌లో అనూస్ సంస్థలో తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రం, కిట్లను అందజేస్తామన్నారు.

నగర వాసులకు సురక్షిత ఆహారాన్ని అందించాలి: జీవీఎంసీ కమిషనర్



సదస్సులో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ

సిరిపురం, ఫిబ్రవరి 6: స్ట్రీట్ ఫుడ్, కార్ట్ వెండర్స్, రిటైల్ ఫుడ్ అవుట్‌లెట్, మిడ్ లెవల్ రెస్టారెంట్ ద్వారా ఆహారాన్ని పరిశుభ్రంగా అందించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. హోటల్ మేఘలయాలో ది వైజాగ్‌పటం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్టీ ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీ అండ్ హైజనిక్ అంశంపై హోటల్ మేఘాలయలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజల జీవన మారుతోందని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునేందుకు ఇష్టపడుతున్నారన్నారు. ఆహార భద్రత, పరిశుభ్రత, ప్రజారోగ్యంపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.నరేష్‌కుమార్, వైజాగ్‌పటం చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ గైరవాధ్యక్షుడు ఎం.సుదర్శన్‌స్వామి, రోలన్డ్ విలియమ్స్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వీధి వ్యాపారులు, రిటైల్ ఫుడ్, అవుట్‌లెట్ యజమానులు పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన జనసేన నేతలు


నాగబాబును సత్కరిస్తున్న వంశీకృష్ణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 6: నగరానికి వచ్చిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును మంగళవారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్, రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని పార్టీ అంశాలను వంశీకృష్ణ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, కమిటీల నియామకాలపై వివరించారు.అనంతరం నాగబాబును సత్కరించారు.

ఓటు వజ్రాయుధం కావాలి


పాదయాత్రను ప్రారంభించిన జనసేన నేత పంచకర్ల సందీప్

మధురవాడ, ఫిబ్రవరి 6: ఓటు వజ్రాయుధమని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ కోరారు. మంగళవారం మానం ఆంజనేయనగర్‌లో పాదయాత్రను ప్రారంభించారు. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నేత పిళ్లా వెంకటరావు సంఘీభావం తెలిపారు. యువతకు జాబు కావాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా టీడీపీ- జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాగోతి నరసింహనాయుడు, శివాజీ, పోతిన నాయుడు, పోతిన బాలాజీ, నక్కా శ్రీధర్, పోతిన తిరుమలరావు తదితరులున్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

మద్దిలపాలెం: శివాజీపాలెంలో మంగళవారం జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. వైసీపీ నేతలు జపసాన పద్మ, భూసు వరలక్ష్మి, పిట్టా ఆదిలక్ష్మి, అరుణశ్రీ, కుమారి, ఇళ్లపు వాసు, ఏదూరి అప్పారావు, తదితరులు పార్టీలో చేరారు.

పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 6: మండలంలోని నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన వైద్య శిబిరంలో 54 మంది విద్యార్థులకు పరీక్షలు జరిపి మందులను అందించారు. దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన శిబిరాన్ని గ్రామ సర్పంచి చాయా గౌతమి ప్రారంభించారు. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు డా.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యురాలు పల్ల నీలిమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'అసెంబ్లీ సాక్షిగా వైసీపీ తప్పుడు ప్రచారం'

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 6: విద్యా వ్యవస్థపై అసెంబ్లీ సాక్షిగా వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ అన్ని విభాగాలను సర్వనాశనం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రద్దు చేశారని, గిరిజన ఉపాధ్యాయులకు ద్రోహం చేశారని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేకుండా చేశారని విమర్శించారు.

వల్లభ వెంకన్న వైభవోత్సవాలు ప్రారంభం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 6: వల్లభ వేంకటేశ్వరస్వామి ఆధ్యాత్మిక పీఠం, కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం వైభవోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి వీణా కచేరి, సంగీతం, తబలా వాయిద్యం, తీర్థ ప్రసాద వినియోగం, విశేష హారతులు నిర్వహించారు. బుధవారం విష్ణుసహస్రనామ పారాయణం, విజయశ్రీ బృందం సంగీత కచేరి, వయోలిన్, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు హిమాంశు ప్రసాద్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ఈసీసీఈ డే

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 6: గ్రేటర్ 16వ వార్డులోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఐసీడీఎస్ సెక్టార్ -2 అంబేద్కర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఎర్లీచైల్డ్ ఫుడ్ కేర్ ఎండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వి.శిల్పియ మాట్లాడుతూ.. 3 నుంచి 6 ప్రీస్కూల్ పిల్లలలో సమగ్ర అభివృద్ధి, ప్రీస్కూల్ లక్ష్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈర్ల దేవి, ప్రథమ ఎగ్జిక్యూటివ్ ఫౌం డేషన్ వి.భారతి, హెచ్‌ఎం జి. నాగమణి, ఏఎన్ఎం శైలజ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి


జడ్సీ శైలజావల్లిని కలిసిన టీడీపీ నాయకులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 6: జోన్‌వన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.శైలజావల్లిని మంగళవారం టీడీపీ పట్టణ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి సహకరిస్తామన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కోరారు. మినీ స్టేడియంలో క్రీడాకారులకు సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జడ్సీని సత్కరించారు. కార్యక్రమంలో చురకల రమణ, పుక్కళ్ల లక్ష్మీకుమారి, అర్థపాకల గురునాథ్, సంజీవ్‌కుమార్, అప్పలనాయుడు, ఎల్లయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

'9 నుంచి బీజేపీ పల్లెకు పోదాం'

భీమునిపట్నం, ఫిబ్రవరి 6: భారతీయ జనతా పార్టీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఈనెల 9న ప్రారంభించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. 9,10, 11 తేదీలు, ఈనెలాఖరున ప్రజాపోరు యాత్రను నిర్వహించనున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో 37 మందితో ఎన్నికల నిర్వహణ కమిటీని నియమించారు. వచ్చే ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీచేయడానికి సమాయత్తమవుతున్నామన్నారు. నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్.రామ్మోహన్, పొలిమేర శ్రీనివాసరావు, దిలీప్‌వర్మ, శ్రీహరి, అనిల్‌కుమార్, అప్పారావు, నాగరాజు, ప్రసాదరావు పట్నాయక్, సునీత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధిదీపాలతో ఇక్కట్లు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 6: గత కొన్ని నెలలుగా సాగర్‌నగర్ వీధులలో వీధిదీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎమ్ఐజీ(డి), ఎల్ఐజీ(సి) బ్లాక్‌ల మధ్య రహదారిలో ఆరునెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు. కొన్నిచోట్ల చెట్లకొమ్మలు అడ్డుగా ఉన్నాయని, జీవీఎంసీ కమిషనర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.